Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 215 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, సోమవారం 01-09-2025 పేజీలు : 12 వెల : 2/-

## విద్యకు, కేరళకు విడదీయరాని అనుబంధం ఉంది

- సిఎం రేవంత్
- విద్యకు ప్రాధాన్యతనిస్తున్న కేరళ దైవ భూమి
- కేరళ అమలు చేస్తున్న 'వయోజన విద్యా కార్యక్రమం'అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది

హైదరాబాద్: తెలంగాణలో విద్యాశాఖను తీసుకునేందుకు నేతలెవరూ సుముఖత వ్యక్తం చేయడం లేదని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళలోని అలెప్పీలో కెసి వేణుగోపాల్ రచించిన పుస్తకాన్ని సిఎం రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వందశాతం అక్షరాస్యతతో దేశంలోనే కేరళ ఫస్ట్ ప్లేస్‌లో ఉందన్నారు. విద్యకు, కేరళకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. దేశంలో వందశాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు. ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న 'వయోజన విద్యా కార్యక్రమం' అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని సిఎం రేవంత్ అన్నారు. కేరళ రాష్ట్రం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి అని ఆయన అభివర్ణించారు. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధమని, అదే అందరికీ గొప్ప శక్తి అని తాను కూడా చాలా బలంగా విశ్వసిస్తానని ఆయన



అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ అని సిఎం రేవంత్ కొనియాడారు. అందుకే అందరితో పాటు తనకు కూడా కేరళను చూస్తే అసూయగా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. 10వ, 12వ తరగతి తర్వాత సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధిస్తే అందులో ఆశ్చర్యమేమీ ఉండదని ఆయన అన్నారు.ఏఐ టెక్నాలజీతో ఐటిఐ స్టూడెంట్స్‌కు టీచింగ్ ఇప్పిస్తున్నాం తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన విద్య అందిస్తున్నామని ఆయన చెప్పారు. తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని సిఎం రేవంత్ అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. పిపిపి మోడల్ పద్ధతిలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని రేవంత్ చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏఐ టెక్నాలజీతో ఐటిఐ స్టూడెంట్స్‌కు టీచింగ్ ఇప్పిస్తున్నామన్నారు. తెలంగాణలో

మిగతా 2లో



## ప్రతిభా సేతుతో యుపిఎస్‌సి అభ్యర్థులకు మేలు

న్యూఢిల్లీ: దేశంంలోని యువ ప్రతిభావంతులకు పోటీ పరీక్షలలో ఉపయోగపడేలా ప్రతిభా సేతు అనే పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. యుపిఎస్‌సి అభ్యర్థుల ప్రతిభా వికాసానికి, పరీక్షలలో తగురీతిలో సంసిద్ధతకు ఈ వేదిక ఉపయుక్తంగా మారిందని తెలిపారు. ఆదివారం ప్రధాని మోడీ ఈ ఆదివారం 125వ మన్ కీ బాత్ ద్వారా ప్రజలకు సందేశం వెలువరించారు. అత్యంత కఠినమైన పరీక్షలలో యుపిఎస్‌సి ఒక్కటి. ఇందుకు అభ్యర్థులు అన్ని విధాలుగా సిద్ధం కావల్సి ఉంటుంది. ఇంతకు ముందటి పరీక్షలు, ఉపయుక్త సమాచారం ఈ పోర్టల్‌లో పొందుపర్చారని , ఇది సివిల్స్ అభ్యర్థులకు మంచి మేలుచేస్తుందని ప్రధాని తెలిపారు. ప్రతి ఏటా ఎందరో ఈ పరీక్షలు రాస్తారు. పోటీ పరీక్షలకు దిగే వారు ఎంతో సమయం, డబ్బు వెచ్చించి ఈ పరీక్షలు రాస్తారు. కొందరు అతి తక్కువ మార్కుల తేడాతో అవకాశం పోగొట్టుకుంటారు. ఇటువంటి వారి కోసం ఈ ప్రతిభా సేతు పోర్టల్ ఆరంభించారని ప్రధాని వివరించారు. సివిల్స్‌లో అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి , ఏదో ఒక స్థాయిలో మెరిట్ లిస్టులో చోటు దక్కని వారి

మిగతా 2లో

## కాళేశ్వరం రిపోర్ట్ కాపీలను చెత్తబుట్టలో వేసి.. అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్



హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. తమకు మైక్ ఇవ్వడం లేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చారు. అక్కడి నుంచి గన్‌పార్క్ వద్ద అమరువీరుల స్థూపం వద్దకు వెళ్లారు. కెటిఆర్, హరీష్‌రావు సహా బిఆర్ఎస్ ఎంఎల్ఎలు అక్కడ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ కాపీలను చెత్తబుట్టలో వేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అది ట్రాష్ రిపోర్ట్, అది చెత్త రిపోర్ట్ అంటూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై చర్చ జరగాలి అనుకుంటున్నప్పుడు తమకు మైక్ ఎందుకు ఇవ్వట్లేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## టారిఫ్‌ల వివాదం.. అమెరికాకు భారత్ షాక్



న్యూఢిల్లీ: అమెరికా తెచ్చిన కొత్త నియమాల కారణంగా భారత్ అమెరికాకు మెయిల్ బుకింగ్స్‌లను ఆపేసింది. 100 డాలర్ల లోపు విలువ చేసే ఉత్తరాలు, డాక్యుమెంట్లు, కానుకలను బుక్‌చేయబోమని తపాలా సేవల శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు కూడా జారీచేసింది. 2020 జూలై 30 జారీచేసిన అమెరికా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ నం. 14324 మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ ఉత్తర్వు ఇదివరలో ఇచ్చిన 800 డాలర్ల మేరకు మినహాయింపును రద్దు చేసింది. జూలై 30న ట్రంప్ యంత్రంగం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 29వ తేదీ నుంచి 100 డాలర్లకుపైగా విలువున్న పార్శిళ్లపై అమెరికా కస్టమ్స్ సుంకాలు అమలులోకి వచ్చాయి. దీంతో అమెరికాకు పార్శిళ్ల బుకింగ్‌లను నిలిపేస్తున్నట్లు భారత తపాల శాఖ ప్రకటించింది.



## బిసి బిల్లులకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుంది:

హైదరాబాద్ : పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లును బిఆర్ఎస్ స్వాగతిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. బిఆర్ఎస్ కు ఇప్పుడు మూడు ప్రొటో కాల్ పొజిషిన్లు ఉన్నాయని అన్నారు. తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధనలపై చర్చపై సందర్భంగా పురపాలక, పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లును శాసన సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా శాసనసభలో కెటిఆర్ మాట్లాడుతూ.. బిసి బిల్లులకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, బిసిల కోసం గతంలో మాజీ సిఎం కెసిఆర్ అనేక పోరాటాలు

మిగతా 2లో

## అపశకునం మాటలొద్దు..అపశకునం మాటలొద్దు..

- గంగుల కు మంత్రి పొన్నం కౌంటర్..
- బీసీలపై మంత్రి పొన్నంకు అవగాహన లేదన్న బిఆర్ఎస్ సభ్యుడు గంగుల
- ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటన్న మంత్రి పొన్నం



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాల రెండో రోజు ఆదివారం పురపాలక చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బీసీలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన బిఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ అవగాహన లేదని వ్యాఖ్యానించడంతో సభలో ఒక్కసారిగా మంత్రులు, సభ్యులు

మిగతా 2లో

## లక్ష కోట్లు ఖర్చు చేసి.. లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ముందుకు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి (%ఖ్రుఎంబఖ్రుతీ =వసంసఎ%) ప్రవేశపెట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. "కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.87,449 కోట్లు ఖర్చు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ దెబ్బతింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా మారాయి. రూ.21 వేల కోట్లతో కట్టినవన్నీ 20 నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి. ప్రాణహిత-చేవెళ్లకు పేరు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలని గతంలో మూడు లేఖలు రాశారు. అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి రాష్ట్రానికి లేఖ రాశారు. ప్రాణహిత-చేవెళ్లకు తొలుత రూ.11,600 కోట్లు కావాలని కమిటీ చెప్పింది" అని అన్నారు.అయితే ప్రాణహిత-చేవెళ్ల డిజైన్లను

మిగతా 2లో



## పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సీతక్క

హైదరాబాద్: పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చట్టసవరణ బిల్లును శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచనతో బిల్లుకు ఆమోదం తెలిపామని మంత్రి సీతక్క తెలిపారు. బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ చట్టసవరణను ప్రతిపాదిస్తున్నామని సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రపతి దగ్గర బిసి బిల్లు పెండింగ్‌లో ఉండడంతోనే సవరణ చట్టాలు తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు.

# విద్యకు, కేరళకు విడదీయరాని అనుబంధం ఉంది

కూడా విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున దృషి సారించామని సిఎం రేవంత్ తెలిపారు. విద్యకు ఉన్న ప్రాధాన్యత గురించి తాను ప్రతి సందర్భంలోనూ ప్రజలకు చెబుతున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం చేసే సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు ఏదీ చేసినా విద్య మనకు అత్యంత ప్రాధాన్యత కలిగిందని ఆయన తెలిపారు. యూత్ స్కిల్స్ అభివృద్ధిలో సౌత్ కొరియా అగ్రస్థానంలో ఉందని సిఎం రేవంత్ అన్నారు.

పేదలు, మైనార్టీల కోసం కెసి వేణుగోపాల్ నిరంతర పోరాటం చేస్తున్నారని ఆయన అండతోనే తెలంగాణ అభివృద్ధిపై మరింత ఫోకస్ చేశామని రేవంత్ తెలిపారు. ఎంపిగా గెలిచిన ప్రియాంకగాంధీ తన నియోజకవర్గాన్ని కర్మ భూమిగా భావిస్తారని రేవంత్ చెప్పారు. తెలంగాణలో పోటీకి ప్రియాంక గాంధీని ఆహ్వానించామని, కానీ, కెసి వేణుగోపాల్ విజ్ఞప్తి మేరకే ప్రియాంక కేరళలో పోటీ చేశారన్నారు. కెసి వేణుగోపాల్ అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరఫున గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని సిఎం రేవంత్ చెప్పారు. 2006లో కెసి వేణుగోపాల్ ప్రారంభించిన పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉందన్నారు. 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయని సిఎం రేవంత్ అన్నారు. ఈ ఏడాది వందశాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 మిలియన్ డాలర్ల ఎకానమీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సిఎం రేవంత్ తెలిపారు. వచ్చే పదేళ్లలో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేరుకుంటుందని రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని ఆయన తెలిపారు. ఒక్కో స్కూల్‌ను రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించినట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. త్వరలో కేరళ రాష్ట్రానికి ఎన్నికలు రాబోతున్నాయని 2026లో జరిగే ఎన్నికలను కేవలం కేరళ అసెంబ్లీ ఎన్నికలుగా భావించవద్దని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అవి 2029లో దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు అవుతాయన్నారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారన్నారు. అదే బిజెపి నాయకుడు నరేంద్ర మోడీ పౌరుల నుంచి ఓటు హక్కును కొల్లగొడుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 2029లో జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిల మధ్య ఉన్న తేడాను గమనించాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2029లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు యువత సంకల్పం తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కేరళలోని అలప్పుజలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నిర్వహించిన 'ఎంపీ మెరిట్ అవార్డ్స్-2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కీలక డిమాండ్ చేశారు. "21 ఏళ్లకే ఐఏఎస్ అధికారులు జిల్లాలను సమర్థంగా పరిపాలిస్తున్నప్పుడు, అదే వయసున్న యువకులు ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదు?" అని ప్రశ్నించారు. దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేశారు. 2026లో జరగబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికలు, 2029లో దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి డబ్బు, అధికారం, మీడియా మద్దతు లేకపోయినా.. ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తెలంగాణ నుంచి పోటీ చేయమని ఆహ్వానించామని, కానీ వారు కేరళను తమ కర్మభూమిగా ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీ యువత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. "దేశంలో మార్పు తీసుకురాగల శక్తి యువతకు ఉంది. యువతే మా బ్రాండ్ అంబాసిడర్లు. వారి భవిష్యత్తు కోసం వారు చేసే పోరాటం కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పెద్ద ఉద్యమం నడుస్తోందని, అందులో అందరూ చేరాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ అభివృద్ధి నమూనా గురించి మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్రంలో కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 100 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బలహీనవర్గాలకు అనుమానం కలిగేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దు అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొత్తం వివరాలు సేకరించేందుకు బిసి కమిషన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధనలపై చర్చపై సందర్భంగా పురపాలక, పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభలో సిఎం మాట్లాడుతూ..బిసిల్లో అపోహలు సృష్టించే విధంగా బిఆర్ఎస్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్ మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ గంగుల కమలాకర్ కు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని తెలియజేశారు. బిసి బిల్లుపై గంగులకు సంపూర్ణ అవగాహన ఉందని భావిస్తున్నానని, వాళ్ల పార్టీ ఆదేశాలకు అనుగుణంగా గంగుల కమలాకర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. బలహీనవర్గాలకు అనుమానం కలిగేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని రేవంత్ సూచించారు. బిసిల్లో అపోహలు సృష్టించే విధంగా గంగుల మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్ కు పంపామని, గంగుల కమలాకర్ అభినందిస్తారని తనకు తెలుసు కానీ ఆయన వెనకున్న వాళ్లు ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. ఆరునూరైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ సూచించారని, బిసి కమిషన్ కు ఇచ్చిన జివొ అయినా డెడికేటెడ్ కమిషన్ కు ఇచ్చిన జివొ అయినా చిత్తశుద్ధి తో వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ఐదుసార్లు ప్రధాని నరేంద్ర మోడికి లేఖ రాశానని, అపాయింట్ మెంట్ ఇవ్వలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు జంతర్ మంతర్ లో దీక్ష పెట్టామని, జంతర్ మంతర్ లో దీక్షకు దాదాపు వందమంది పార్లమెంటు సభ్యులు మద్దతు పలికారని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లకు రాజ్యసభ లో ఉన్న బిఆర్ఎస్ ఎంపిలు ఏం మాట్లాడలేదని, బలహీన వర్గాల వైపు మాట్లాడుతున్న గంగుల కమలాకర్ కూడా ఏం మాట్లాడరని రేవంత్ దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అడ్డుపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పురపాలక, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్, గవర్నర్ తీరు కారణంగానే జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపిందని రేవంత్ గుర్తుచేశారు. అయితే, గవర్నర్ వాటిని ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలనకు పంపారని, సుమారు 5 నెలలుగా ఆ బిల్లులు అక్కడే ఉన్నాయని తెలిపారు. "గత ప్రభుత్వం 2018, 2019లో తెచ్చిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలు రిజర్వేషన్లకు గుదిబండగా మారాయి. వాటిని సవరించేందుకు ఆర్డినెన్స్ తీసుకొస్తే, దానిని కూడా గవర్నర్ రాష్ట్రపతికి పంపారు" అని సీఎం వివరించారు. ఈ విషయంపై ప్రధానిపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే, బీఆర్ఎస్ ఎంపీలు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రేవంత్ విమర్శించారు. "బీసీల గురించి మాట్లాడుతున్న గంగుల కమలాకర్ కూడా ఆ ధర్నాకు రాలేదు. వాళ్ల పార్టీ నాయకుడికి బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. ఇప్పుడు కూడా సభలో గందరగోళం సృష్టిస్తూ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవాలని చూస్తున్నారు" అని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీఆర్ఎస్ నేతలు సహకరించాలని, లేదంటే భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రతిభా సేతుతో యుపిఎస్‌సి అభ్యర్థులకు మేలు: ప్రధాని మోడీ

పేర్లను కూడా ఈ పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఈ పోర్టల్ పరిశీలించుకుని ప్రైవేటు సంస్థలు మెరిట్ లిస్టులో లేని వారికి కూడా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. దేశానికి పర్వదినాల కాలం. మనమంసివితా ఈ శుభ సందర్భంలో స్వదేశీ ఉత్పత్తుల వాడకం బాట పడుదాం. ఇందుకు గర్విద్దాం అని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఇక వరుసగా మనకు పండుగలు సాంప్రదాయక ఉత్సవాలకు అద్దం పడుతూ ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనం దేశీయ దుస్తులు ధరించాలి. ఇక్కడ తయారు అయ్యే అనేక రకాల సరుకులను విరివిగా ప్రచారం చేయాలని, ఇది జాతీయ ఉద్యమమే అవుతుందని తెలిపారు. మన ముందు ఎంచుకున్న సుసంపన్న భారత్ లక్ష్య ఛేదనకు కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉంది. మనం స్థానికత నినాదం వెల్లువెత్తేలా ప్రతిన వహించాల్సి ఉందని ప్రధాని చెప్పారు. మన కాళ్ల మీద మనం నిలబడటమే కాదు, ముందుకు పరుగులు తీసే విధంగా ఆత్మనిర్భరతను చాటుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అమెరికా నుంచి మన సరుకులపై అత్యధిక రీతిలో 50 శాతం సుంకాల విధింపు వల్ల తలెత్తిన పరిస్థితి నుంచి గట్టెక్కడానికి స్వదేశీ ప్రధాన అంశం అవుతుందని ఆయన చెప్పకనే చెప్పారు. మన సంస్కృతి సంప్రదాయాలకు ఎల్లెడలా ఖ్యాతి దక్కుతోంది. రామాయణం, భారతీయ సంస్కృతి పట్ల ప్రేమ ఆదరణ, అక్కున చేర్చుకునే తత్వం ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు నలుమూలలా విస్తరిస్తోంది. కెనడాలోని మిసిస్‌సౌగాలో ఆగస్టులోనే 51 అడుగుల ఆజానుబాహు రామ విగ్రహం ఆవిష్కరణ జరిగింది. అందరిని ఆకట్టుకొంటోందని ప్రధాని చెప్పారు. ఈ వర్షాకాలం దేశంలోని పలు ప్రాంతాలలో వర్షాకాల ప్రకృతి వైపరీత్యాలు బాధాకరం అయ్యాయని ప్రధాని చెప్పారు. ఉత్తరాఖండ్ ఇతర చోట్ల జలవిలయాన్ని ప్రస్తావించారు. ఈ నష్టదాయక పరిణామాలు మనకు కాలం మిగిల్చే సవాళ్లు పరీక్షలు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో నిర్వాసితులు అయ్యారు. రహదారులు దెబ్బతిన్నాయి. ఆనకట్టలు ధ్వంసం అయ్యాయి. జరిగిన ఆస్తినష్టం, ప్రాణనష్టం బాధాకరం అన్నారు. ప్రకృతి వైపరీత్యం నడుమనే జమ్మూ కశ్మీర్‌లో రెండు ప్రధాన ఘట్టాలు జరిగాయి. ఇది ఎక్కువ మందికి దృష్టికి రాకపోవచ్చు. అక్కడి పుల్వామాలో తొలిసారి డే నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగింది. శ్రీనగర్‌లోని దాల్‌లేక్‌లో కేలో ఇండియా వాటర్ స్పోర్ట్ ఉత్సవాలు జరిగిన విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ జమ్మూ కశ్మీర్‌కు చెందిన యువకుడు మెహిసిన్ అలీతో కొద్దిసేపు మాట్లాడారు. ఆయనకు క్రీడలలో బంగారు పతకం వచ్చింది. ఇటువంటి వారు తమ సమర్థతతో దేశానికి ఈ ప్రాంతం తరఫున ప్రతిష్ట తెస్తారని చెప్పారు.

తమ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడీ ఈసారి కొద్ది సేపు ఉక్కు మనిషి , దేశ తొలి హోం మంత్రి సర్దార్ పటేల్ మాటలతో కూడిన ఆడియో విన్పించారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్ విమోచన దినోత్సవం జరుగుతుంది. పటేల్ తమ ఆపరేషన్ పోలో సందర్భంగా వెలువరించిన ప్రసంగం ఆడియో ద్వారా ప్రధాని మోడీ పటేల్‌ను , పలువురు అమరవీరులను స్మరించుకున్నారు.

# అపశకునం మాటలొద్దు..అపశకునం మాటలొద్దు..

తీవ్రంగా స్పందించారు. అదే సందర్భంలో మంత్రి పొన్నం ఘాటుగా స్పందిస్తూ ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటని జవాబిచ్చారు. దీంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ అంశంపై వివరాల్లోకి వెళితే పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ముఖ్యమంత్రి తరఫున పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మున్సిపల్ పరిధిలో ఉన్న స్థానిక సంస్థలన్నింటిలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తాము గట్టిగా సంకల్పించామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని గత ప్రభుత్వం చేయలేని పని తమ ప్రభుత్వం చేసిందని పొన్నం స్పష్టం చేశారు. అనంతరం జోక్యం చేసుకున్న గంగుల మాట్లాడుతూ బీసీలపై పొన్నం ప్రభాకర్‌కు వాస్తవం తెలీదని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర వివరణ ఇస్తే బాగుంటుందని కోరారు. ఈ దశలో గంగుల వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుబడుతూ బీసీల్లో అనుమానాలు కలిగేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని కోరారు. కేసీఆర్ కుటుంబం ఎవరినీ కలవని కుటుంబమని విమర్శించారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లును తాను సంపూర్ణంగా స్వాగతిస్తున్నానని, అయితే శాస్త్రీయ పద్ధతిలో చేయాలని మాత్రమే కోరుతున్నామని బిఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. వెనుకబడిన కులాలను మోసం చేయవద్దని ఆనాడే చెప్పామని, తమ సూచనలు పరిగణనలోకి తీసుకుంటే ఎలాంటి చిక్కులు ఉండవని చెప్పామన్నారు. జీవో ఇవ్వకుండా గడచిన 22 నెలలు ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. సుమారు ఆరు కమిటీలు వేశారని, 2024 మార్చిలో బీసీ కమిషన్ ద్వారా జీవో తీసుకొచ్చారని చెబుతూ తదనంతరం బీసీ కమిషన్ మాయమైందని గంగుల అన్నారు. తర్వాత జీవో నెం.18 తీసుకొచ్చారని, ప్లానింగ్ డిపార్టుమెంట్ ద్వారా సర్వే చేస్తామన్నారని గుర్తు చేశారు. అనంతరం కలుగజేసుకున్న మంత్రి పొన్నం గంగుల కామెంట్లకు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. తనకు ఏమీ తెలీదని అనటం బిఆర్ఎస్ సభ్యుడు గంగుల అవివేకమని అన్నారు. ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటని పేర్కొన్నారు. గంగుల తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని గంగుల కామెంట్లను వెనక్కి తీసుకోవాలని కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా జోక్యం చేసుకుని సీనియర్ సభ్యుడిగా మంత్రిని ఆ విధంగా మాట్లాడడం సరికాదని, మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తప్పుపట్టారని అన్నారు. వెంటనే మీరు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నట్లు చెప్పాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభ్యుడు గంగుల ప్రభాకర్‌ను ఉద్దేశించి అన్నారు. ఇందుకు గంగుల స్పందిస్తూ తాను తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేయాలని కోరుతున్నానని అన్నారు. బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇలాగే జివోలు ఇవ్వడం వల్ల రిజర్వేషన్ల అంశం న్యాయపరంగా నిలువ లేదని, అందుకే పార్లమెంటులో బిల్లు ఆమోదించి తద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రిజర్వేషన్లు అమలు చేయడానికి సంపూర్ణంగా వీలుంటుందని తెలిపారు. ఇదే విషయం చెప్పాను తప్ప తాను గానీ, తమ పార్టీ గానీ బిసి రిజర్వేషన్లను వ్యతిరేకించడం లేదని, అందరికన్నా తానే ఎక్కువగా సంతోషిస్తానని చెప్పారు.

# కెసిఆర్ రాజీనామా చేయాలి: సిపిఐ నారాయణ

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖరరావు (కెసిఆర్) తక్షణమే తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ తరుణంలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పటికీ కెసిఆర్ గైర్హాజరై ఉండటం బాధ్యత రాహిత్యమని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టబడి, కాళేశ్వరం ప్రాజెక్టు పై రిపోర్ట్ సమర్పించబడి జరిగిన కీలక చర్చల్లోనూ కెసిఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా ఫాం హౌస్‌లో నాటకాలు ఆడుతున్నారా? అంటూ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన అభినందించారు. ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి, కేంద్రానికి పంపించి ఆమోదం పొందాలని కోరారు. సిపిఐ తరపున రేవంత్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు డాక్టర్ నారాయణ స్పష్టం చేశారు.



## లక్ష కోట్లు ఖర్చు చేసి.. లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు: ఉత్తమ్

అప్పటి సిఎం కెసిఆర్ మార్చారని కమిటీ చెప్పిందని ఉత్తమ్ పేర్కొన్నారు. "మేడిగడ్డలో బ్యారేజ్ నిర్మించవద్దని నిపుణుల కమిటీ స్పష్టంగా చెప్పింది. మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని వ్యాప్కోస్ నిపుణులు కూడా చెప్పారు. వ్యాప్కోస్ డిపిఆర్ ఇవ్వకముందే మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారు. కేబినెట్ అనుమతి లేకుండానే జివొ ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణ ఖర్చులను భారీగా పెంచేశారు. బ్యారేజ్‌లకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తవ్వాల్సి ఉంది. దాన్ని రూ.లక్షా 47 వేల కోట్లకు పెంచారు" అని ఉత్తమ్ ) వివరించారు. 2019 నుంచి 2023 వరకు లిఫ్ట్ చేసినవి 162 టిఎంసిలు మాత్రమే అని ఉత్తమ్ తెలిపారు. "కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టిఎంసిలు మాత్రమే లిఫ్ట్ చేశారు. 34 లక్షల ఎకరాలకు ఆయకట్టుకు నీరు ఇస్తామని చెప్పారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగినప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఎన్‌డిఎస్‌ఎఫ్‌పై బిఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బిల్లు తెచ్చినప్పుడు బిఆర్ఎస్ మద్దతిచ్చింది. డ్యామ్‌కు, బ్యారేజ్‌కు తేడా లేకుండా పనులు చేశారని ఎన్‌డిఎస్‌ఎ నివేదికలో ఉంది. మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలిపోయేందుకు కారణమయ్యారు" అని ఉత్తమ్ అన్నారు. %శాశ్రీంశీ =ఘుస% : రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం కన్ఫ్యూజన్ లో ఉంది: కెటిఆ

## బిసి బిల్లులకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుంది: కెటిఆర్

చేశారని తెలియజేశారు. ఒబిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కెసిఆర్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ను కోరారని, తెలంగాణ మొట్టమొదటి స్పీకర్ గా బలహీనవర్గాల బిడ్డ మధుసూదనాచారిని నియమించామని అన్నారు. తెలంగాణ మొట్టమొదటి మండలి ఛైర్మన్ గా బలహీనవర్గాలకు చెందిన స్వామిగౌడ్ ను నియమించామని కెటిఆర్ పేర్కొన్నారు. అడ్వకేట్ జనరల్ కూడా బిసిలను బిఆర్ఎస్ నియమించిందని, బలహీనవర్గాలకు చెందిన బిఎస్ ప్రసాద్ ను అడ్వకేట్ జనరల్ గా కెసిఆర్ నియమించారని చెప్పారు. 2021 జనగణనతో పాటు కులగణన చేయాలని బిఆర్ఎస్ కోరిందని, కులగణనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే ముందే మాట్లాడింది కెసిఆర్ ప్రభుత్వమేనని కెటిఆర్ అన్నారు. అసెంబ్లీ, మండలి, పార్లమెంటులో ఒబిసి రిజర్వేషన్లు తీసుకరావాలని అప్పట్లోనే తీర్మానించామని, రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ వేస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2010 లో తీర్పు ఇచ్చిందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై కేసు నమోదు



రాయ్‌పుర్: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై 'అభ్యంతరకర' వ్యాఖ్యలు చేసినందుకుగాను తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదయిందని ఆదివారం పోలీసులు పేర్కొన్నారు. 'ఒకవేళ బంగ్లాదేశ్ నుంచి చొరబాటును ఆపడంలో అమిత్ షా విఫలమైతే ముందు ఆయన తల నరికి మీ టేబుల్‌పై పెట్టండి. సరిహద్దు భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోంది' అని మహువా మొయిత్రా ఇటీవల ఆగ్రహంతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తన ఆగ్రహాన్ని చాటారు. దీనిపై గోపాల్ సమంతో అనే స్థానిక వ్యక్తి ఫిర్యాదు చేశారు. దాంతో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ పోలీసులు భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 196, 197 కింద శనివారం మనా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. అంతేకాక అతడు తన ఫిర్యాదులో బంగ్లాదేశీ కాందిశీకులు రాయ్‌పుర్‌లోని మనా క్యాంప్ ఏరియాలో 1971 నుంచే పెద్ద సంఖ్యలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మహువా మొయిత్రా చేసిన వ్యాఖ్యలు రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొట్టవచ్చని పేర్కొన్నారని పోలీసు అధికారి తెలిపారు. దీనికి ముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కోత్వాలీ పోలీస్ స్టేషన్‌లో కూడా ఆమెపై ఓ ఫిర్యాదు దాఖలయింది. మహువా మొయిత్రా ఇటీవల కేంద్రంపై విరుచుకుపడుతూ 'బిజెపి నేతలు పదేపదే చొరబాటుదార్ల గురించి మాట్లడతారే తప్ప దేశ సరిహద్దులను పరిరక్షించే బాధ్యతలను నిర్వర్తించరని, సరిహద్దుల్ని పరిరక్షించే ఐదు భద్రతా దళాలు కేంద్ర హోం శాఖ పరిధిలోనే పనిచేస్తున్నాయని, కేంద్ర హోం శాఖ, హోం మంత్రి సరిహద్దుల్ని పరిరక్షించలేనప్పుడు.. చొరబాటుదారులు దేశ ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రధాని స్వయంగా వాపోతున్నప్పుడు%శా% ఆ తప్పు ఎవరిది?' అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆమె అమిత్ షాను ఉద్దేశించి ఆగ్రహంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా దీనిని బిజెపి ఖండించింది.

## తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాల్సింది మేము కాదు బిజెపి: శ్రీధర్ బాబు



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు రావొద్దని ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు శాసన సభలో ప్రసంగించారు. ప్రజల సమస్యలపై చర్చ కోసం సభను 15 రోజులు నిర్వహించాలని డిమాండ్లు వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. వర్షాలు, వరదలు, నిమజ్జనాలను దృష్టిలో పెట్టుకొని సభపై నిర్ణయం తీసుకుంటామని, బిసి బిల్లుపై ప్రతిపక్షాలు తొలి నుంచి నెగిటివ్ ఆలోచనతోనే ఉన్నాయన్నారు. బిసి సబ్ ప్లాన్ పెట్టమని అప్పట్లో బిఆర్ఎస్ నేతలు మాట్లాడారని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాల్సింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పవర్‌లోకి వస్తే 50 శాతం సీలింగ్ ఎత్తేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారన్నారు. బిసిలకు న్యాయం చేసే బిల్లులకు బిఆర్ఎస్ సమర్థిస్తారో లేదో చెప్పాలని నిలదీశారు. బిసి బిల్లులకు సంబంధించి అంశాలపైనే విపక్షాలు మాట్లాడాలని శ్రీధర్ బాబు సూచించారు. పంచాయతీ, మున్సిపల్లో 50 శాతం కోటా మించొద్దని చట్టాలున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. పాత చట్టాల్లోని 50 శాతం కోటా ఎత్తేస్తూ సవరణ బిల్లులు తీసుకొచ్చామని వివరణ ఇచ్చారు. రాజకీయంగా బలహీన వర్గాలకు అన్యాయంపై కమిటీ రిపోర్ట్ ఇచ్చిందని, జనాభా పరంగా బిసిలకు అన్యాయం జరుగుతోందని కమిటీ తెలిపిందన్నారు. బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకే సవరణ బిల్లులు తీసుకొచ్చామన్నారు.

సత్యమేవ జయతే



## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేసిన వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి








సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ వికారాబాద్ మున్సిపల్ లోని వార్డు నెంబర్ 8 (మద్గుల్ చిట్టెంపల్లి )మరియు గుడుపల్లికి సంబందించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేసిన వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీ. అర్ధ. సుధాకర్ రెడ్డి గారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుచేస్తుందని ప్రతి నిరుపేద ఇండ్లు లేని కుటుంబలకు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం ద్వారా ఇళ్ళు నిర్మించి ఇస్తామని
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ వికారాబాద్ శాసనసభ్యులు శ్రీ. గడ్డం. ప్రసాద్ కుమార్ గారి సహాయ సహకారంతో వికారాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజల కోసం పరితపించే నాయకుడు ప్రసాద్ కుమార్ గారు అని వికారాబాద్ కు శాసనసభ్యులుగా ఉండటం ప్రజల అదృష్టం అని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో యువ నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ గారు వార్డు నాయకులు మల్లయ్య, వెంకటయ్య గౌడ్, బంధయ్య రామకృష్ణ రెడ్డి, రాములు లాలయ్య, నర్సిములు,జమిల్, ఈశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు

## నీట మునిగిన వరి,పత్తి పంటలు. ప్రభుత్వ ఆర్థికంగా ఆదుకోవాలి





సత్యమేవ జయతే/హత్నూర: మంజీరా నది ఉధృతంగా ప్రవహించడంతో హత్నూర మండలంలోని కాసాల, పన్యాల,కోన్యాల, చీక్ మద్దూర్ నది పరివాహక ప్రాంతాలలోని వరి,పత్తి పంటలు నీట మునిగిపోయాయి. దీంతో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రోజులుగా భారీ వర్షాలు కారణంగా మంజీరా నదిలోకి వరద నీరు చేరడంతో మంజీరా నది దిగువ ప్రాంతాలకు నీరును వదలండంతో వాగు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహిస్తుంది. మంజీరా వాగు పరిసర ప్రాంతంలోని వరి, పత్తి పంట పొలాలకు నీరు చేరి అన్నదాతలకు భారీ నష్టం సంభవించింది. వేలాది రూపాయలు పంటలపై పెట్టుబడులు పెట్టగా వర్ష బీభత్సంతో మంజీరా నది గేట్లు ఎత్తడంతో నది తీర ప్రాంతంలో ఉన్న పంట పొలాల్లోకి నీరు ప్రవహిస్తుందని తమ గోడును వెళ్లగక్కారు. సంబంధిత అధికారులు నీట మునిగిన పంటలను పరిశీలించి ప్రభుత్వం పరంగా నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు.

### యూరియా కొరత సర్కారు వైఫల్యమే.

### -బిఆర్ఎస్ యువజన నాయకులు అమ్రాది జగదీష్.



సత్యమేవ జయతే/హత్నూర: ఎరువుల కోసం రైతన్నలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి కాంగ్రెస్ యూరియా కొరత సర్కారు వైఫల్యమే కారణమని బిఆర్ఎస్ యువజన నాయకులు అమ్రాది జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం హత్నూర మండల విలేకరులతో ఆయన మాట్లాడారు.గత పదేళ్ల కెసిఆర్ ప్రభుత్వ పాలనలో ఏ ఒక్కరోజు ఎరువుల కొరత రాలేదని, ఎరువుల దుకాణాల ముందు అన్నదాతలు యూరియా కోసం నిలుచున్న కాలం లేదన్నారు. నేటి కాంగ్రెస్ సర్కారు వైఫల్యం వల్లే యూరియా కోసం ఆధార్ కార్డులు, చెప్పులు, వర్షంలో రైతన్నలు తడుస్తూ ఎరువుల కోసం క్యూ లైన్ లో నిలబడే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ సర్కారు పాలనలో రైతులు నానా అవస్థలు పడి వ్యవసాయం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు చొరవ తీసుకొని రైతులకు కావాల్సినంత యూరియా అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆందోళనలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరికలు చేశారు.

# నరేంద్ర మోదీ గారి మీద అనుచిత వ్యాఖ్యలు సరికావు







సత్య మేవ జయతే బినారాయణ ఖేడ్ప్రధాని నరేంద్రమోడీని ప్రపంచమంతా విశ్వాగురువుగా భావిస్తే కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహులు గాంధీ ప్రతి సారి కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ అన్నారు. నారాయణఖేడ్ మండల అధ్యక్షులు దశరథ్ పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు పత్రీ రామకృష్ణ మాట్లాడుతూ బీహార్ లో జరిగిన కాంగ్రెస్ సభలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఒక బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడిగా ఉండి రాహుల్ గాంధీ మోడీ తల్లిపై దుర్భాశలాడడం సిగ్గు చేటన్నారు. ప్రధాని మోడీ ని ధైర్యంగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులు, తల్లులపై విమర్శలు చేస్తున్న దమ్ములేని నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు.ఇకనైనా విమర్శలు మానుకోకపోతే ఊరుకునేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారికి రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ రాజ్,వివిధ మండల అధ్యక్షులు యెన్నాం అనిల్ రెడ్డి,శంకర్ రావు, మాజీ మండల అధ్యక్షులు కృష్ణ, అశోక్, సాగుణాకర్, పట్నం మాణిక్, మోర్చా అధ్యక్షులు భూంరాజ్, పవన్, దశరథ్,నవీన్, జ్ఞానేశ్వర, లోకేష్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# సాయి గణేష్ మహరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తితోపాటు పలు సేవా కార్యక్రమాలు








సత్యమేవ జయతే, ఆగస్టు 31, కుత్బుల్లాపూర్ ప్రతినిధి :- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,సూరారం డివిజన్,సంజయ్ గాంధీనగర్లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయి గణేష్ మహరాజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం వినూత్నంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారి హోమంలో పాల్గొని, వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా 10 మంది బీద విద్యార్థులకు రూ. 5000/- చొప్పున ఆయన చేతులమీదుగా ఆర్థిక సహాయం అందజేశారు.అంతేకాకుండా కార్యక్రమాన్ని పురస్కరించుకొని సుమారు 50 మంది స్వచ్ఛందంగా (బ్లడ్ డొనేషన్) రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... భక్తి కార్యక్రమాల్లో భాగంగా సాయి గణేష్ మహరాజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినూత్నంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం నేటి యువతకు ఎంతో ఆదర్శమని కొనియాడారు.ఈ సందర్భంగా యూత్ సభ్యులను అభినందించారు. అనంతరం యూత్ సభ్యులు మాట్లాడుతూ... నేటి యువత భక్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరం అన్నారు. అందులో భాగంగానే తమ యూత్ సభ్యులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదానంతో పాటు పేదలకు విద్యాదానం చేస్తే భవిష్యత్తు బాగుంటుందని, "అన్నం ఇస్తే జీవితం ఒకరోజు మాత్రమే గడుస్తుంది, విద్యనిస్తే జీవితం జీవితాంతం వెలుగుతుంది" అని అన్నారు. అంతేకాకుండా పేదలకు పలు సేవా కార్యక్రమాలు చేయడం అసోసియేషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద రాములు,పెద్ద అరుణ్ కుమార్,పెద్ద అనిల్ కుమార్,డాక్టర్ పెద్ద అజయ కుమార్ , హనుమంతరావు, సింగారయ్య,గోపాల్ రెడ్డి,పున్నారెడ్డి, రాములు కుమార, జైపాల్ రెడ్డి,రాజ్ కుమార్,అనిల్ కుమార్,రాజశేఖర్,ఏ. అనిల్,హరి,సత్యనారాయణ,గిరి,వీర మణికంఠ,సాయి,వినోద్,సతీష్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి,వివేక్,కార్తీగల లక్ష్మి నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల వినాయక మండపాలను సందర్శించిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి







సత్యమేవ జయతే వికారాబాద్ టౌన్ మున్సిపల్ పరిధిలోని పెద్ద వార్డుల ప్రజల కోరిక మేరకు వినాయక మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఖరబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ మున్సిపాల్ ఫ్లోర్ లీడర్ అర్ధ సుధాకర్ రెడ్డి వారితోపాటు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ నాయకులు కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలో పాల్గొనడం జరిగింది

సత్యమేవ జయతే


## డీ పీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం...



కుత్బుల్లాపూర్, ఆగస్టు 31, (సత్యమేవ జయతే ప్రతినిధి) :-కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,సుభాష్ నగర్ డివిజన్,డీపీ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డీపీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీపీ కాలనీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గౌడ్,విజయ్,ప్రభాకర్, రంగస్వామి,వైస్ ప్రెసిడెంట్ వాసు, హెూటల్ శీనన్న,సీతారామయ్య,సాయి రెడ్డి,కాశిం,భాషా భాయ్ గౌడ్,డబ్బా శీను, రాంబాబు,రమణారెడ్డి,గణేష్,రవి గౌడ్, తిరుపతి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నోటీసుల పేరుతో వేధిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి.


### - జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన వేధింపులు ఆపడం లేదంటూ బాధితులు ఆరోపణ.



సత్యమేవ జయతే/హత్నూర: నిర్మాణ పనులు కోర్టు కేసులో ఉన్నప్పటికీ ఓ జిల్లా పంచాయతీ అధికారి బాధిత కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ నోటీసుల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత 50 సంవత్సరాల నుండి నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డును తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి నోటీసులతో వేధింపులకు గురి చేస్తున్నారని ఆ రేకులషెడ్డు తాలూకు మహమ్మద్ దస్తగిరి, నసీర్ లు ఆరోపణలు చేశారు. దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ రివిజన్ రికార్డు,అసెస్మెంట్, యజమాని ధ్రువీకరణ పత్రాల రికార్డులు ఉన్నప్పటికీ పదేపదే నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. ఇంతటితో ఆగకుండా అనుమతులు లేవని నిర్మించుకున్న రేకుల షెడ్డు ను జెసిబి సహాయంతో తొలగించారని బాధితులు ఆవేదన చెందారు.రేకుల షెడ్డు వివాదం కోర్టు కేసులో ఉన్నప్పటికీ నోటీసుల పేరుతో వేధింపులు చేస్తున్నారన్నారు. అన్యాయంగా నోటీసులు ఇస్తూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఈ నెల 4న సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినా కానీ మళ్లీ, మళ్లీ నోటీసులు ఇస్తూ మానసికంగా వేధింపులు మాత్రం ఆగడం లేదని బాధితులు వాపోయారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం..





సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా...బీహార్ ఎన్నికల ప్రచారంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ మాతృమూర్తి పై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వికారాబాద్ పట్టణం లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వికారాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు కొప్పుల రాజశేఖర్ రెడ్డి అధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దాహనం చేసిన బీజేపీ నాయకులు కార్యకర్తలు..తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా లో తహసీల్దార్ లు బదిలీ లు...



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. వికారాబాద్ జిల్లాలో ముగ్గురు తహసీల్దార్ బదిలీ అయ్యారు కొడంగల్ తహసీల్దార్ దీపక్. పూడూర్ తహసీల్దార్ విజయ్ కుమార్ నియమితులయ్యారు అలాగే కలెక్టర్ ఆఫీసులో భరత్ గౌడ్ నియమించారు. రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి అధికారులను బదిలీలు చేసినట్లు తెలిసింది..

# బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.ఈ సంచలన నిర్ణయం ద్వారా 50% రిజర్వేషన్ సీలింగ్ (కోటా పరిమితి) ను సడలించడాన్ని టార్గెట్ చేస్తోంది. ఈ దిశగా ప్రత్యేక జీవో (గవర్నమెంట్ ఆర్డర్) జారీ చేయడానికి సిద్ధం అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం 42% బీసీ రిజర్వేషన్ ను ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయనుంది.

**పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285కు సవరణ:**

పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(%ూ%) లో సవరణలు చేయాలని కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణతో బీసీ వర్గాలకు పంచాయతీ రాజ్ ఎన్నికలలో అధిక రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటుంది. ఈ సవరణ ద్వారా, బీసీ వర్గాలు ప్రాతినిధ్యం పెంచుకొని, వారికి మరింత స్థానం, అధిక అవకాశాలు కల్పించడానికి మద్దతు లభిస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం 50% సీలింగ్ను సడలించేందుకు చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టే నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనితో, రిజర్వేషన్ల కోటా పరిమితిని నెమ్మదిగా పెంచవచ్చు. ప్రస్తుతం దేశంలో ఉన్న 50% రిజర్వేషన్ సీలింగ్ (పరిమితి) ను తొలగించడం ద్వారా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరిన్ని అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆర్డినెన్స్ కు ఆమోదం లభించకపోవడంతో, జీవో (గవర్నమెంట్ ఆర్డర్) ద్వారా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జీవో ద్వారా, కొత్త రిజర్వేషన్ విధానాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ జీవో కోసం ప్రభుత్వ ఆమోదం ఇప్పటికే సిద్ధం అవుతోంది. ఈ జీవో అమలు చేయడం ద్వారా, తెలంగాణలో బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, పంచాయతీ ఎన్నికలలో మరింత ప్రాతినిధ్యం ఉంటుంది...

## క్రమశిక్షణ, అంకితభావంతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు

### - పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ నాయకుడు రవికిరణ్

సత్యమేవ జయతే - బోధన్ బోధన్ : క్రమశిక్షణ, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పీఆర్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట రవికిరణ్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్స్ లో బోధన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పరుచూరి నగేష్ బాబు ఉద్యోగవిరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.నగేష్ బాబు సమయపాలనకు క్రమశిక్షణకు మరోపేరని, తన సర్వీస్ కాలంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనని ఆయన అన్నారు. బోధన్ ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ నగేష్ బాబు ఉపాధ్యాయులకు ఆదర్శమని, పిల్లల భవిష్యత్తు కోసం ఆయన ఆయన ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా నగేష్ బాబు-వసుంధర దంపతులను అతిథులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, బోధన్ జేఏసీ చైర్మన్ పీ గోపాల్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బోధన్ తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి, బోధన్ మాజీ వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఎంబెల్లి శంకర్, మోహన్, హైస్కూల్ హెచ్ఎం బాలచంద్రం పాల్గొన్నారు.



## వానలు కురిస్తే ఇక్కడ వనుకే.. భయం గుప్పిట్లో మన్యం గ్రామాలు

సత్యమేవ జయతే - భద్రాద్రి కొత్తగూడెంభద్రాద్రి కొత్తగూడెం : వానలు ఎక్కడ కురిసినా..తుఫాను ఎక్కడ తీరం దాటినా దిగువ ప్రాంతాలకే తిప్పలు తప్పడం లేదు. ఎగువున వరదలు.. దిగువున దిగులు అన్నట్లుగా ప్రతి యేటా వరద ప్రభావిత గ్రామాలకు ముంపు కష్టాలు తప్పడం లేదు.ప్రతి యేటా జులై, ఆగస్టు నెలలు వస్తే భద్రాచలం డివిజన్ పరిధిలోని గ్రామాలు వరద భయానికి ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది.

రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జిల్లాలకు భారీ వర్ష సూచన ఉంటే భద్రాచలం ముంపు గ్రామాలకు వరద కష్టాలు తప్పడం లేదు. గత నెల రోజుల నుండి వరద ప్రవాహం భద్రాచలాన్ని పోటెత్తుతూనే ఉంది. ఇప్పటికి రెండుసార్లు రెండవ ప్రమాద హెచ్చరికను దాటి వరద ఉగ్రరూపాన్ని చూపెట్టింది. ప్రతిసారి రోజుల తరబడి వరద ప్రవాహం భద్రాచలం డివిజన్ తో పాటు బూర్గంపాడు మండలాల సైతం ఆనుకొని ఉండటంతో ముంపు గ్రామ ప్రజలు ఈ సమయంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే ఆయా గ్రామాల్లో వరద నీరు చేరడంతో పరిసర గ్రామాలకు రాకపోకలు తెగిపోతున్నాయి. తెలంగాణ తీర ప్రాంతంలోనే కాకుండా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు కురిస్తే భద్రాచలంకే ముప్పు వాటిల్లు తుంది. భద్రాచలం పట్టణం మాత్రం తెలంగాణలో ఉన్నప్పటికీ పరిసర గ్రామాలు అంతా భద్రాచలం మీదనే ఆధారపడి బతుకుతున్నాయి.

గ్రామాలకు గోదారి వరద తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతుంది. ఆంధ్ర ప్రాంతం నుండి భద్రాచలానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోవటంతో అక్కడ ప్రాంత వాసులు భద్రాచలం రావటానికి కష్టతరం అవుతుంది. దీంతోపాటు సరళ దుమ్ముగూడెం ప్రాంతాలకు భద్రాచలంతో రాకపోకలు తెగిపోతున్నాయి. పట్టణంలోని రామాలయం సమీపంలో వరద నీరు చేరటంతో అక్కడ ఉన్న ప్రజలు ముందస్తుగానే ఎత్తు ప్రాంతాలకు తరలి వెళ్లాల్సి వస్తోంది.

- మళ్లీ తుఫాను వచ్చే అవకాశం

మరోసారి తుఫాను ప్రభావం వస్తుందని హెచ్చరికలు జారీ చేయడంతో ముంపు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే భద్రాచలంలో వరద ప్రభావం రెండోసారి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించినప్పటికి ఇంకా 47 అడుగుల నీటిమట్టంలోనే ఉంది. ఈ ప్రవాహంలో మరో తుఫాను ముంచుకొస్తే భద్రాచలం, బూర్గంపాడు మండలాల ప్రజలకు తీవ్ర నష్టమే జరిగే అవకాశాలు కనపడుతున్నాయి.



# రైతుల సమస్యల పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాదయాత్ర : మాజీ చీఫ్ విప్ దాస్యం

సత్యమేవ జయతే - వరంగల్ వరంగల్ : స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు, రైతుల సమస్యల పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాదయాత్ర చేస్తున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు.

వేలేరు, చిల్పూర్, తరిగొప్పుల మండలాల రైతులకు సాగునీరు అందించాలనే సంకల్పంతో వేలేరు నుంచి గండిరామారం వరకు స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేపడుతున్న పాదయాత్ర ను ఆదివారం వేలేరు మండల కేంద్రంలో దాస్యం వినయ్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం నాడు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి, పట్టుదల, ఉత్సాహం నేడు తెలంగాణ శ్రేణులలో కనిపిస్తుందని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ని చూసి స్టేషన్ ఘన్పూర్లో కడియం శ్రీహరి ని గెలిపిస్తే పార్టీకి ద్రోహం చేసి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని నిస్సహాయక స్థితిలో ఉన్నాడని విమర్శించారు. త్యాగాలకు కేరాఫ్‌గా రాజయ్య ఉంటే అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్ కడియం శ్రీహరి అని ఎద్దేవా చేశారు. ఘన్పూర్ ఉప ఎన్నికల్లో కడియం శ్రీహరికి రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ రూ.104 కోట్లతో సాగునీటి పనులకు శంకుస్థాపన చేసారని, ఆ పనులు పూర్తయితే పార్టీకి, కేటీఆర్‌కు మంచి పేరొస్తుందనే పనులను కడియం శ్రీహరి అడ్డుకుంటున్నారని విమర్శించారు. పాదయాత్ర వేలేరు నుంచి శాలపల్లి, పీచర, మద్దెలగూడెం, చిల్పూర్ మండలం కొమ్ముగుట్ట, లింగంపల్లి, ఫతేపూర్, మీదుగా గండిరామారం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జి భూపతి రాజు, పాదయాత్ర ఇన్‌చార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కర్ర సోమిరెడ్డి, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు .



## జీవన తాత్వికత తెలిసిన కవి మునాస వెంకట్ : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సత్యమేవ జయతే - నల్గొండ నల్గొండ : ప్రకృతితో మమేకమై జీవన తాత్వికతను తన కవిత్వంలో నేర్పుగా ఆవిష్కరించగల కవి మునాసు వెంకట అని ప్రజా కవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో నల్లగొండకు చెందిన ప్రముఖ కవి మునాస వెంకట్ కవిత్వం దాపు పుస్తకాన్ని దావిజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని గోరటి వెంకన్న మాట్లాడారు. అస్తిత్వ ఉద్యమాలలో దళిత బహుజన కవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవుల్లో మునాస వెంకట్ ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రముఖ విమర్శకులు అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ..అట్టడుగు వర్గ జీవితాలతో అంతర్జాతీయ స్థాయి కవిత్వం రాసిన వారు మునాస



వెంకట్ అని కొనియాడారు.

మరొక విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ నవ్యమైన అభివ్యక్తితో తనదైన శైలిలో కవిత్వం రాసిన వెంకట్ కవిత్వం తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం అజరామరం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ బెల్లి యాదయ్య ,కవి గాయక సిద్ధార్థ, బైరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య భాను, కొత్వాల్, పెరుమాళ్ల ఆనంద్, అంబటి వెంకన్న, తుల శ్రీనివాస్, మేరెడ్డి యాదగిరి రెడ్డి, శీలం భద్రయ్య, బోధనం నర్సిరెడ్డి, పగడాల నాగేందర్, భూతం ముత్యాలు, సాగర్ల సత్తయ్య, కస్తూరి ప్రభాకర్ మాదగాని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులకు కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య



సత్యమేవ జయతే మోమిన్ పేట్ బీ భర్త వేధింపులు భరించలేక కట్టుకున్న భర్తని కడతేర్చిన సంఘటన చోటుచేసుకుంది. మోమిన్ పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామ పరిధిలో అమానుష ఘటన జరిగింది. భర్త వేధింపులు తట్టుకోలేక ఓ భార్య కట్టుకున్న భర్తను కడతేర్చింది. మోమిన్ పెట్ ఎస్సై అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంటారం మండల పరిధిలోని రొంపల్లి గ్రామానికి చెందిన కుర్వ కుమార్(35) రేణుక(30) దంపతులు గత రెండు సంవత్సరాలుగా కేసారం గ్రామ పరిధిలో గల ఓ వెంచర్లో జీవనం కొనసాగిస్తున్నారు. ప్రతిరోజు తన భర్త మద్యం తాగి నిత్యం వేధిస్తున్నాడని విసిగిపోయిన ఆమె ఆదివారం నాడు ఉదయం రేణుక తన భర్త కుమార్ మద్యం మత్తులో ఉండగా తన కళ్లలో కారం కొట్టి మెడకు కేబుల్ వైరు చీర బిగించి ఊపిరాడకుండా చేసి చంపేసింది.మృతునికి ఇద్దరు పిల్లలు మనోజ్(8) సందీప్(5) ఉన్నారని మోమిన్ పేట్ ఎస్సై అరవింద్ తెలిపారు. మృతుని తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు

### వినాయక.. సెలవికా..!!

**%-% నిమజ్జనంకు తరలిన గణనాథులు**

**%-% స్వాగతించిన చీఫ్ విప్, ఎమ్మెల్యే, సమితి సభ్యులు**

**%-% బందోబస్తు నిర్వహించిన పోలీసులు**

సత్య మేవ



జయతే వికారాబాద్ జిల్లా... తాండూరు లో వినాయకా సెలవికా.. అంటూ అంటూ తాండూరు భక్తులు గణనాథులను వీడ్కోలు పలికారు. ఐదు రోజులు మండపాల్లో ప్రతిష్ఠించి వినాయకులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ఉత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగాయి. భద్రేశ్వర చౌరస్తా మీదుగా గణేషుల శోభాయాత్ర కోలాహలంగా కొనసాగుతోంది. యువత కేరింతలతో.. నృత్యాలతో గణనాథునికి సెలవు పలికారు. మద్యాహ్నం నుంచి మొదలైంది. తాండూరు పట్టణంలో జరిగిన వినాయక నిమజ్జన వేడుకలలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు పాల్పంచుకున్నారు. స్థానిక భద్రేశ్వర్ చౌక్ వద్ద హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఊరేగింపు వినాయకులకు స్వాగతం పలింకారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, కరణం పురుషోత్తంరావు, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి. నాయకులు డా. సంపత్ కుమార్, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నిమజ్జనానికి తరలివెళ్లే ప్రతి వినాయకునికి తాండూరు హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. మున్సిపల్ పరిధి పాత తాండూరు కోట సమీపంలో, పట్టణంలోని భద్రేశ్వర చౌరస్తాలో స్టేజీలు వేసి వినాయకులకు స్వాగతం పలికారు. మరోవైపు నిమజ్జనం సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు...

### : జ్ఞాన సమాజం నిర్మించడమే స్వేరోస్ లక్ష్యం

**- స్వేరో కోర్ రాష్ట్ర చీఫ్ బాబు నాయక్**



సత్యమేవ జయతే - వరంగల్ వరంగల్ : రాష్ట్రవ్యాప్తంగా సుశిక్షితులైన వారియర్స్ స్వేరో కోర్ సైనికులను తయారు చేస్తామని రాష్ట్ర స్వేరో కోర్ చీఫ్ కమాండర్ బాబు నాయక్ గారు పేర్కొన్నారు. వరంగల్ పట్టణ కేంద్రంలో స్వేరో నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వేరో కోర్ చీఫ్ బాబు నాయక్ హాజరై రాష్ట్రంలో స్వేరో సైన్యాన్ని తయారు చేయుటకు స్వేరో కోర్ నిర్మాణం కోసం 33 జిల్లాలు పర్యటించి సమసమాజం కోసం పాటుపడే స్వేరో వారియర్స్ ని తయారు చేసే క్రమంలో వరంగల్ జిల్లాకు రావడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షులు దూడల సిద్ధు స్వేరో, జిల్లా కార్యదర్శి కందికట్ల ప్రవీణ్ స్వేరో.జిల్లా అధికార ప్రతినిధి గారే జయరాజు స్వేరో, పర్వతగిరి మండల అధ్యక్షులు రాహుల్ స్వేరో, ప్రధాన కార్యదర్శి జీవన్ స్వేరో, సహాయ కార్యదర్శిలు జైపాల్ ,విజయ్ ,వినయ్, దుగ్గొండి మండల అధ్యక్షులు మంద కార్తీక్ స్వేరో , ప్రధాన కార్యదర్శి తరుణ్, అంబాల అఖిల్ , ప్రవీణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వీర్నపల్లిలో సాగు భూములు లాక్కోవద్దని దళిత కుటుంబాల నిరసన



సత్యమేవ జయతే - కరీంనగర్ీంనగర్ : తమ సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవద్దని పలువురు దళిత కుటుంబాలు అదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో సర్వే నెంబరు 318, 49లో ఎకరం భూమిని దాదాపు 70సంవత్సరాలనుండి అదే భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నామన్నారు. సదరూ భూమిపై పట్టాదారు పాస్ బుక్ ఉందని, బ్యాంకు లోన్లు కూడా తీసుకున్నామని తెలిపారు.ఆ స్థలం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేస్తామని అధికారులు చెప్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ భూములు తీసుకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, మాకు ఆత్మహత్యే శరణ్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పునరాలోచన చేయాలని, కలెక్టర్ తమకు న్యాయం చేయలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మునిగే గంగవ్వ,యాస యాకూబ్, మునిగే పోచయ్య, మునిగే లచ్చవ్వ, మునిగే దేవవ్వ, మునిగే శంకర్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో, మంజీర నది ప్రవాహంతో నిట మునిగి పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందుకోవాలి

**కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు**

సత్య మేవ జయతే మనూర్నారాయణఖేడ్: భారీ వర్షాలతో, మంజీర నదిలో మునిగి పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం అందుకోవాలని కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగ కెవిపిఎస్ టీం ఆధ్వరంలో మంజీర నదిలో మునిగిన పంటలను పరిశీలించడం జరిగింది. వారు మాట్లాడుతూ. ఇప్పటికే భారీ వర్షాలతో అనేకమంది పేద బడుగు బలహీన వర్గాల రైతుల భూములు వర్షపు నీళ్లతో మునిగి పంట నష్టపోవడం జరిగింది. మరియు ఇప్పుడు మంజీరా నది ప్రవాహం ఎక్కువ రావడంతో మంజీర నది తీరాన ఉన్న పంట పొలాలు మునిగి భారీగా రైతులు నష్టపోవడం జరిగింది. చాలామంది రైతులు ఇతరుల దగ్గర కౌలుకు తీసుకొని అనేక డబ్బులు ఖర్చు పెట్టుకుని అనేక అప్పుల పాలై భూములు కౌలు చేసుకుంటే భారీ వర్షంతో మంజీర నది వచ్చి చాలామంది రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు దారి తీసే విధంగా సమస్య తయారయింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని కెవిపియస్ డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో సతిష్, రాజు, మచ్చందర్ ,విష్ణు, తదితరులు పాల్గొన్నారు



## గణేష్ లడ్డూ వేలం రికార్డు బ్రేక్..!

**%-% చరిత్ర సృష్టించిన మంచాల ఫ్యామిలి**

**%-% నాలుగో సారి కూడా మ్యాజిగ్ ఫిగర్‌తో లడ్డూ సొంతం**

**%-% తాండూరులో ఇదే అత్యధిక వేలం ధర**

**%-% హైరేంజ్‌లో కైవసం చేసుకున్న వారు ఎవరె-వరంటే..?**



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. తాండూరు, : తాండూరులో వినాయకుని లడ్డూకు భలే డిమాండ్ లభించింది. ఆదివారం పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. ఇందులో రికార్డు ధరకు లడ్డూల వేలం జరిగింది. ఆదివారం రాత్రి తాండూరు పట్టణంలోని పటేల్ భగీచాలోని గణేష్ లడ్డూ రికార్డులు బ్రేక్ చేసే రేటుకు హరాజ్ అయ్యింది. పట్టణంకు చెందిన మంచాల కుటుంబ సభ్యులు అధిక ధరకు వేలం పాడి దక్కించుకున్నారు. మంచాల భాను రేఖ, అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు రూ. 4లక్షల 55వేల 555లకు గణేష్ లడ్డూను దక్కించుకున్నారు.

గత యేడాది కూడా ఈ కుటుంబ సభ్యులే అదే గణేషుని వద్ద రూ. 4లక్షల 11వేల 111లకు దక్కించుకున్నారు. ఇప్పటి వరకు నాలుగోసారి లడ్డూ సొంతం చేసుకున్నారు. మరోవైపు తాండూరు పట్టణంలో ఇప్పటి వరకు పట్టణంలోని కన్యా పాఠశాల వద్ద గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుని వద్ద లడ్డూ రూ.3లక్షల 1 వెయ్యి 116లు పలికింది. పట్టణానికి చెందిన చెన్మిళ్ల మనిష్ కుమార్ అధిక ధరను పాడి లడ్డూను దక్కించుకున్నారు.

పట్టణంలోని బాలాజీ మందిర్లో మార్వాడి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుని వద్ద పూజలందుకున్న లడ్డూను వరుసగా రెండో యేడాది మార్వాడీ బజార్ కు చెందిన నందకిషోర్ పర్తాని కుటుంబ సభ్యులు రూ. 2లక్షల 52వేలకు కైవసం చేసుకున్నారు. ఈసారి తొలి లడ్డూ వేలంను హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు ప్రారంభించారు. పట్టణంలోని భద్రేశ్వర దేవాలయం వద్ద ప్రతిష్టించిన వినాయకుని వద్ద లడ్డూను ఆయన రూ. 1లక్ష 1,116లకు దక్కించుకున్నారు. పట్టణంలోని పసారి వార్డులో శ్రీ మణికంఠ వినాయక ఉత్సవ సమితి వద్ద రూ. 1లక్ష 40వేలకు లడ్డూ వేలం జరిగింది

## ఎస్బీఐ కుంభకోణం కేసును ఛేదించిన పోలీసులు.. 44మంది అరెస్ట్ : సీపీ అంబర్ కిషోర్ ఝూ



సత్యమేవ జయతే - చెన్నూర్

చెన్నూర్ : చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచి లో జరిగిన కుంభకోణం కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్ తో సహా 44 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీడియా ఎదుట ముగ్గురు ప్రధాన నిందితులను ప్రవేశ పెట్టారు. క్యాషియర్‌తో పాటు స్కాంలో బ్యాంక్ మేనేజర్, ఎనిమిది మంది సిబ్బంది కీలక పాత్ర పోషించారు. నిందితుడి నుంచి 15.237 కిలోల బంగారు ఆభరణాలు, రూ.లక్షా 23 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నిందితులను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ మీడియా ఎదుట హాజరుపరిచారు. రామగుండంలోని సీపీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సీపీ వెల్లడించారు.ఆగస్టు 23న ఎస్బీఐ చెన్నూర్ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా చెన్నూర్‌లో పీఎస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. బ్యాంకులో 402 గోల్డ్ లోన్ ఖాతాలో 25.17 కిలోల బంగారాన్ని నిలువ ఉంచిందని, వీటి విలువ రూ.12.61 కోట్లు, నగదు రూ.1.10 కోట్లు దుర్వినియోగం చేసి దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. కేసును చేధించడానికి నాలుగు ప్రత్యేక బృందాలను మంచిర్యాల్ డీసీపీ ఏ. భాస్కర్, పర్యవేక్షణలో ఏసీపీ జైపూర్ ఏ. వెంకటేశ్వర్‌కు అప్పగించామని వివరించారు. దర్యాప్తు అధికారి, ప్రత్యేక బృందాలు బ్యాంకును తనిఖీ చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించి, క్యాషియర్ నరిగె రవీందర్ ఖాతాలో ఆడిట్ నిర్వహించగా భారీగా అనుమానాస్పద డిపాజిట్లు ఉన్నట్లు తేలిందని వివరించారు. ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించామని వెల్లడించారు.

క్టోబర్ 2024కు ముందే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్న క్యాషియర్ తన నష్టాన్ని పూడ్చుకునేందుకు, మరింత బెట్టింగ్ కొనసాగించేందుకు బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి మోసానికి పాల్పడ్డాడని తెలిపారు. బ్యాంక్ కరెన్సీ, ఛెస్ట్ తాళం మేనేజర్, క్యాషియర్ సంయుక్త ఆధీనంలో ఉండాలని నిబంధనలు ఉండగా మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్ తన తాళాన్ని క్యాషియర్‌కు ఇచ్చాడని దాన్ని ఉపయోగించుకుని, నరిగె రవీందర్, క్యాషియర్, మేనేజర్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సహకారంతో బంగారం, నగదు దొంగిలించేందుకు పథకం రచించాడని అన్నారు. అక్టోబర్ 2024 నుంచి తరచూ గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి, తన స్నేహితులకు అప్పగించి ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి, డబ్బును తమ ఖాతాల్లో జమ చేసి, కొంత కమిషన్



తీసుకుని మిగతా మొత్తాన్ని క్యాషియర్ రవీందర్‌కు బదిలీ చేసేవారని వివరించారు. ఇప్పటివరకు నిందితులు పది ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీలలో 44 మంది పేర్లపై 142 గోల్డ్ లోన్లు తీసుకున్నారని తెలిపారు. క్యాషియర్ నరిగె రవీందర్ బ్రాంచ్ మేనేజర్‌తో కుమ్మక్కై తన భార్య, మరిది స్నేహితుల పేర్లతో తప్పుడు గోల్డ్‌లోన్లు 42 మంజూరు చేసి, బంగారం లేకుండానే రూ.1.58 కోట్లు 4.14 కిలోల బంగారం తాకట్టు పెట్టినట్లు చూపించి విత్‌డ్రా చేసుకున్నాడని అన్నారు. వాస్తవ నష్టం 21 కిలోల బంగారం విలువ ఉంటుందని చెప్పారు. క్యాషియర్ రవీందర్, ఏటీఎంలలో నగదు రీఫిల్ చేసే సమయంలో కూడా డబ్బు అపహరించేవాడని తెలిపారు. దర్యాప్తు అధికారి ఇప్పటివరకు ముగ్గురు బ్యాంకు అధికారులు, వారికి తోడ్పడిన 41 మందితో కలిపి మొత్తం 44 నిందితులను అరెస్టు చేశామని అన్నారు. వివిధ బ్యాంకుల నుంచి 15.23 కిలోల బంగారు నగలు రికవరీ అయ్యాయని తెలిపారు. మిగతా బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉందన్నారు. గోల్డ్‌లోన్ కంపెనీ మేనేజర్ల పాత్ర పై విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. ఈ కేసును తక్కువ కాలంలోనే చాకచక్యంగా ఛేదించినందుకు పోలీసు అధికారులను అభినందించారు.

సత్యమేవ జయతే



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం..

### అసెంబ్లీ జీరో అవర్ లో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

### - కోరుట్ల, మెట్ పల్లి ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించాలి



సత్యమేవ జయతే – కోరుట్ల కోరుట్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో మౌళిక సదుపాయాల కల్పనలో పూర్తిగా విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ధ్వజ మెత్తారు. అసెంబ్లీ జీరో అవర్ లో వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే ఆదివారం మాట్లాడారు. ఆదివారం నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచి పోవడం బాధకరమన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ సర్కార్ ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలు చేస్తామని గొప్పలు చెప్పారని, కనీసం ఇప్పుడు బిల్లులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు.

తన నియోజకవర్గ సమస్యలపై ఆరోగ్య శాఖ మంత్రికి విన్నవించగా వెంటనే స్పందించిన క్షేత్రస్థాయిలో అధికారులు మద్దతు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లేషన్ యాక్ట్ గురించి మాట్లాడుతున్నామని ప్రైవేట్ మెడికల్ ట్రీట్మెంట్కు సంబందించి బిల్లులు చెల్లించడం మానేసిన తర్వాత దాని గురించి ఏం మాట్లాడుతారని ప్రశ్నించారు. కోరుట్ల నియోజకవర్గంలోని మెట్పల్లి, కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన ఒక్క సమస్య కూడ ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. మంచం పట్టిన మాన్యం అని చిన్న వయసులో విన్నానని ఇలాంటి వార్తలు ఇప్పుడు మళ్లీ చూడాల్సిరావడం బాధకరమన్నారు.

మెట్పల్లి ప్రభుత్వాసుపత్రి సమస్యలపై ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి వివరించానని, మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, 75శాతం పూర్తైన ఆసుపత్రి బిల్లులు వెంటనే విడుదల చేయాలని, మిగతా పనులు పూర్తి అయ్యేలా చూడాలని తన ముందే ఫోన్ చేశారని తెలిపారు. ఈ విషయంలో నాలుగు సార్లు ఆరోగ్య శాఖ మంత్రి స్పందించిన అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఇటువైపు చూసిన దాఖాలాలు లేవన్నారు. ఆశా వర్కర్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2500 ఉన్న వేతనాలను రూ. 10 వేలు చేశామన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం పెంచుతామని మాట ఇచ్చి తప్పడం సరికాదన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉందని, సీజనల్ వ్యాదులు ప్రభలుతున్నాయని సరిపడా మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కోరుట్లలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్న కొత్తగా స్టాఫ్ ను నియమించలేదని, మందులు అందుబాటులో లేవని చెప్పారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, వైద్య పరికరాలు లేక బోసి పోయిందన్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్పందించాలని స్పీకర్ చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు.

## ఒక్కసారి మల్లన్నసాగర్‌లో కాళేశ్వరం జలాలను చూడండి.. కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ నేత జీడిపల్లి రాంరెడ్డి సూచన



సత్యమేవ జయతే – తోగుట్ట తోగుట్ట : కరువు కాటకాలతో తల్లడిల్లుతున్న తెలంగాణ మాగానిలో గోదావరి జలాలు పారించి సస్యశ్యామలం చేయించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని తొగుట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. తొగుట మండలంలోని మల్లన్న సాగర్ ప్రాజెక్టును సందర్శించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నోరు తెరిస్తే కాళేశ్వరం కూలిపోయింది, కాలిపోయిందని మాట్లాడుతున్నారని, ఒక్కసారి మల్లన్నసాగర్‌లో 8 పంపుల ద్వారా నిర్విరామంగా వస్తున్న కాళేశ్వరం జలాలను చూడాలన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం కూలిపోయింది, లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. మా హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి నుండి మల్లన్న సాగర్‌కు జలాలు వస్తున్నాయని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు.. నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిర్మించినయి కావా అని ఆయన ప్రశ్నించారు.. 60 ఏళ్ల పాటు పాలించిన వారికి తెలంగాణ కరువుకాటకాలు పట్టలేవన్నారు. తెలంగాణ వస్తేనే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని మాట్లాడిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసి చూపించాడన్నారు.

– కేసీఆర్ మీద కోపంతో విష ప్రచారం చేస్తూ..

గత యాసంగిలో మల్లన్న సాగర్ నుంచి పది టీఎంసీల నీటిని పంటపొలాలకు వాడుకున్నది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు.. గత ప్రభుత్వంలో ఏమైనా పొరపాటు జరిగితే సరిదిద్దుకోవాలి కానీ కేసీఆర్ మీద కోపంతో విష ప్రచారం చేస్తూ రైతులు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు ఏం కోల్పోయారో ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు గొప్ప వరమని సొసైటీ చైర్మన్ కే హరి కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమరయ్యలు పేర్కొన్నారు. ఎక్కడో ఉన్న గోదావరిని ఇక్కడికి తీసుకువచ్చి సాగునీరు, తాగునీరు పారిశ్రామిక అవసరాలకు నీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. విమర్శలు పక్కనపెట్టి మల్లన్నసాగర్ జలాలు పూర్తిగా వినియోగించుకునేలా చిన్న కాలువలు కూడా పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు స్వామి గౌడ్, మహిపాల్ రెడ్డి, స్వామి, బాలరాజు తదితరులు ఉన్నారు.

# గనుల్లో రక్షణకే ప్రాధాన్యమిస్తాం

### గనుల్లో రక్షణకే ప్రాధాన్యమిస్తాం

### - ప్రమాదరహిత సంస్థ కోసం నిరంతరం కృషి చేస్తాం

### - సీఎండీ బలరామ్ నాయక్

### - క్యాతనపల్లిలో 49వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష



అత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : బొగ్గు గనుల్లో రక్షణకే ప్రథమ ప్రాధాన్యమిస్తామని, ప్రమాద రహిత సంస్థ కోసం నిరంతరం కృషి చేస్తామ ని సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉత్వల్ థా అధ్యక్షతన 49వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు, సింగరేణి అధికారులనుద్దేశించి ప్రసంగించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. ప్రతి కా ర్మికుని ప్రాణం ఎంతో విలువైనదని, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులంతా రక్షణ చర్యలు కచ్చితంగా పాటించాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం గనుల్లో రక్షణ చర్య ల పెంపు కోసం కార్మిక సంఘాల నాయకులు అనేక సూచనలు చేశారు. నాణ్యమైన హెల్మె ట్లు, బూట్లు సరఫరా చేయాలని, మెరుగైన వై ద్య సేవలు అందించాలని, క్యాంటీన్లలో సకల సౌ కర్యాలు కల్పించాలని, కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని.. గుర్తింపు కార్మిక సం ఘం ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఇతర నాయకులు పలు సూచనలు చేశారు.

అనంతరం రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ టీ ఆర్. కన్నన్, డీజీఎంఎస్ అధికారులు రక్షణ పెంపుదల కోసం పలు సూచనలు చేశారు. సంస్థ డైరెక్టర్లు (ఈ అండ్ ఎం) సత్యనారాయణ రావు, (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు, (పీఏ అండ్ డబ్ల్యూ) గౌతం పొట్రూ ఐఏఎస్, రక్షణ చర్యలపై ప్రసంగించారు. ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జీఎం సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ రక్షణ నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సగం మందికే రేషన్ కార్డులు

### - మంత్రి హామీ.. ఉత్తమాటేనా..?

### - పెండింగ్‌లో మరో లక్షకు పైగా దరఖాస్తులు

### - ఏడాదిగా నిరీక్షిస్తున్న అర్జీదారులు




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : రేషన్ కార్డుల జారీలో కాంగ్రెస్ ప్రభుత్వం నగరవాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నది. పేదలకు రేషన్ కార్డులు అందించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నది. కొత్త కార్డు కోసం దరఖాస్తులు చేసుకొని.. ఏడాది గడుస్తున్నా పేదలకు నిరాశే మిగులుతున్నది. ఆరు నెలల్లోనే నగరంలోని అన్ని డివిజన్లలో రేషన్ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఉత్తమాటే అయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది ఇండ్లకు ఇప్పటిదాకా విచారణకు రాలేదని వాపోతున్నారు. మరికొన్ని చోట్ల అర్హులను వదిలేసి.. ఎలాంటి అర్హత లేనివారికి, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే కొత్త కార్డులు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

– 2,19,717 మంది దరఖాస్తు..

హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,19,717 మంది దరఖాస్తు చేసుకుంటే.. దాదాపు లక్ష మందికి మాత్రమే కొత్తకార్డులు అందాయి. మరో లక్షకు పైగా ఎంక్వైరీ దశలో ఉన్నట్లు అధికారిక సమాచారం. దరఖాస్తు చేసుకుని ఏడాది కావొస్తున్నా సగం మందికి కూడా మంజూరు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉండటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా ఉన్నదని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు.

– సెప్టెంబర్ కోటా వారికే..

వర్షాకాలం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ సరుకులను అందజేశారు. మూడు నెలలు పూర్తికావడంతో సెప్టెంబర్ నెల సరుకులు పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈనెల 20 లోపు కొత్త రేషన్ కార్డులు వచ్చినవారికే సెప్టెంబర్ నెల కోటా సరకులను అందజేయనున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ జిల్లాలోని రెండు లక్షల పైగా దరఖాస్తుదారుల్లో ఇప్పటిదాకా లక్ష మాత్రమే జారీ చేశారు. మిగిలిన లక్షకు పైగా మంది అర్హులు సెప్టెంబర్ కోటా బియ్యం తీసుకోలేని పరిస్థితి నెలకొంది.

దరఖాస్తు చేసుకొని ఏడాది దాటుతున్నా అర్హులను గుర్తించడంలో తీవ్ర జాప్యం జరగటం వల్లే అర్హతలున్నా సరకులను పొందలేని దుస్థితి వచ్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో పాటు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నవారు సెప్టెంబర్ నెల బియ్యం తీసుకుంటే.. తమకు అన్ని అర్హతలున్నా కార్డులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా తమకు తొందరగా రేషన్‌కార్డులు మంజూరు చేసి సరుకులు అందేలా చూడాలని కోరుతున్నారు.

– ఎందుకింత జాప్యం?

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొని ఏడాది అవుతున్నా అర్హులందరినీ గుర్తించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అర్హులను గుర్తించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ, రెవెన్యూ సిబ్బంది కూడా పనిచేస్తున్నారు. మూడు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నా ఇప్పటికీ దరఖాస్తుల్లో సగం మందికి కూడా కార్డులు అందకపోవడం గమనార్హం. కొన్ని కాలనీల్లో ఇప్పటికీ తమ వద్దకు విచారణ అధికారులు రాలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

మరికొన్ని చోట్ల తమ పక్కింటి వారిని విచారించి, కార్డు మంజూరు చేశారని, తమ వద్దకు మాత్రం ఇంతవరకు ఏ అధికారి రాలేదని అంటున్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతల అనుచరులు, అనుకూలమైన వారికే ముందుగా రేషన్ కార్డులు అందజేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. అధికారులు జాప్యం చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. తమకు అందాల్సిన సరుకులను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పౌర సరఫరాల అధికారులు, ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ తొందరగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ కెసిఆరే

### %దేశంలో అతిపెద్ద మానవ తప్పిదం కాళేశ్వరం

### డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా పనులు

### సిడబ్లుసి అనుమతి లేకుండానే నిర్మాణం

### అధికారులు హెచ్చరించినా కెసిఆర్ వినలేదు

### కేబినెట్ అనుమతి లేకుండానే నిర్మాణానికి జిఒ

### కెసిఆర్‌పై చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉంది

### అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలు

### నీళ్లు, డబ్బులు పోయాయి : భట్టి



హైదరాబాద్: సిడబ్లూసి అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఈ విషయాన్ని పిసి ఘోష్ కమిషన్ తన నివేదికలో పేర్కొందని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీనికి కర్త, కర్మ, క్రియ మాజీ సిఎం కెసిఆర్ అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం అసెంబ్లీలో పిసి ఘోష్ కమిషన్ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లఘు చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద మానవ తప్పిదం కాళేశ్వరం నిర్మాణమని, అధికారులు హెచ్చరించినా ఆనాడు కెసిఆర్ వినలేదని మంత్రి ఉత్తమ్ సభకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్ మేడ్ డిజాస్టర్ అని ఆయన అన్నారు. మేడిగడ్డ నిర్మాణం మాజీ సిఎం కెసిఆర్‌ది వ్యక్తిగత నిర్ణయమని ఆయన తెలిపారు. అప్పటి కేబినెట్ అనుమతి లేకుండానే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి జీఓ ఇచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆరోపించారు.

కాళేశ్వరం కోసం రూ.87,449 కోట్లకు పైగా ఖర్చు చేశారని, తీరా ఇప్పుడు చూస్తే ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. రూ.21 వేల కోట్లతో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కట్టారని ప్రస్తుతం ఆ బ్యారేజీలు నిరుపయోగంగా మారాయ న్నారు. 20 నెలల నుంచి అవి నిరుపయోగంగా ఉండటం చాలా బాధాకరమైన విషయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మూడు బ్యారేజీల టెండర్‌ల విధానంలోనూ నిబంధనలు ఉల్లంఘించారని నివేదికలో కమిషన్ సూచించిందని ఆయన ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కట్టాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని, వాప్కోస్ రిపోర్ట్ కంటే ముందే మేడిగడ్డ దగ్గర బ్యారేజీ కట్టాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. 2014లో హైడ్రాలజీ క్లియరెన్స్ సైతం వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రాణహిత చేవెళ్లపై 2014 నాటికే రూ.11 వేల 600 కోట్లు ఖర్చు పెట్టామని, ప్రాణహిత ప్రాజెక్టు అంచనా రూ.38 వేల 500 కోట్లు అయితే కాళేశ్వరం పూర్తి చేయడానికి రూ.లక్షా 27 వేల కోట్లు ఖర్చు చేశారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు.రూ.38 వేల 500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను అకారణంగా రీజన్ లేకుండానే కెసిఆర్ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి దానిని లక్షా 47 వేల కోట్ల రూపాయలకు పెంచారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అప్పటి సిఎం అహోదాలో కెసిఆర్ ఇంజనీర్‌లా వ్యవహారించి టెక్నికల్ అంశాల్లో జోక్యం చేసుకున్నారని ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 195 టిఎంసిల నీటిని ఎత్తివేస్తామని బిఆర్ఎస్ చెప్పిందని, ఐదేళ్లలో మొత్తం 125 టిఎంసీలను మాత్రమే లిఫ్ట్ చేశారని, అందులో 35 టిఎంసీలను మళ్లీ సముద్రంలోకి వదిలేశారని ఆయన తెలిపారు. లక్షకు పైగా కోట్లు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టులో అతి తక్కువ కాలంలోనే ఆరు పిల్లర్లు కూలిపోవడం దారుణమని మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎడిటోరియల్

# సవాళ్లే అభివృద్ధికి సోపానాలు

భారతదేశం ఎప్పుడూ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించింది. అది జాతీయ ప్రయోజనాలను ముందుంచి, ప్రపంచ శక్తులతో సంబంధాలను నిర్వహిస్తున్నది. అయితే, ఇటీవలి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, ఆయన అనుసరించిన విధానాలు ఈ సమతుల్యతను పరీక్షకు గురి చేస్తున్నాయి. ట్రంప్ తన రెండో పదవీకాలంలో భారత్- పాకిస్తాన్ మధ్య సంభవించిన యుద్ధాన్ని తాను అడ్డుకున్నానని పదేపదే చెప్పుకుంటున్నాడు. ఇది భారత్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా తయారయింది. ప్రధాని నరేంద్ర మోడీ ఈ వ్యాఖ్యలపై స్పందించలేనీ బలహీనతకు పడిపోవడం దేశప్రజలకు ఆశ్చర్యం, విచారాన్ని కలిగించింది. మోడీ మౌనం విపక్షాల విమర్శలకు దారితీసింది. చారిత్రకంగా, భారత్ 'కశ్మీర్' లాంటి సున్నితమైన అంశాల్లో కూడా మూడో దేశాల జోక్యాన్ని ఎన్నడూ అంగీకరించలేదు.1971 ఇండో -పాక్ యుద్ధంలో ఇందిరా గాంధీ అమెరికా ఒత్తిడిని తిరస్కరించి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని సాధించారు. అలాగే, నెహ్రూ కాలంలో స్వతంత్ర అలీన విధానం 'కోల్డ్ వార్' సమయంలో భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని, గౌరవాన్ని తెచ్చిపెట్టింది. సోవియట్ యూనియన్‌తోనూ, అమెరికాతో సమానంగా దౌత్యసంబంధాలు కొనసాగించింది. భారత అవసరాలను, ప్రతిష్ఠను కాపాడింది. ఇప్పుడు, 2025లో ట్రంప్ విధానాలు భారత్‌కు కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. రష్యన్ ఆయిల్ కొనుగోళ్లపై అసంతృప్తితో అమెరికా భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను విధించింది. మొదట 25% ఆగస్టు 1 నుంచి, మరో 25 శాతం అదనంగా 27 నుంచి. ఇది భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.గత ఏడాది భారత్ అమెరికాకు 87 బిలియన్ డాలర్ల వస్తువులను ఎగుమతి చేసింది. ఇందులో 55% భారం ఈ సుంకాల దెబ్బకు గురవుతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. వస్త్ర పరిశ్రమ, జెమ్స్ అండ్ జ్యువెలరీ, రసాయనాలు, సముద్ర ఉత్పత్తులు, లేబర్ -ఇంటెన్సివ్ సెక్టార్లు తీవ్రంగా నష్టపోతాయి. క్రిసిల్ రిపోర్టు ప్రకారం మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్, ఎంఇఎస్) 45% ఎగుమతులను నిర్వహిస్తాయి. వీటిలో టెక్స్‌టైల్స్ ఎంఎస్‌ఎంఇ 70% వరకు ఎగుమతులు కోల్పోవచ్చు. ఫలితంగా, భారత జిడిపి గ్రోత్ 0.2 నుంచి 0.6 శాతం తగ్గవచ్చు, నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది. జులై 2025లో నిరుద్యోగ రేటు 5.2 శాతంగా ఉంది. కానీ ఈ సుంకాలు యువతలో నిరాశను పెంచుతాయి.ముఖ్యంగా 'ఐటి లే ఆఫ్', ఎంఎస్‌ఎంఇ మూసివేతల నేపథ్యంలో. ఈ సమస్యలు మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానంపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గత 11 ఏళ్లలో బిజెపి పాలనలో విదేశీ సంబంధాలు వ్యక్తిగత బంధాలపై ఎక్కువ ఆధారపడ్డాయి. 2019లో హ్యూస్టన్‌లో 'హౌడీ మోడీ', 2020లో గుజరాత్‌లో 'నమస్తే ట్రంప్' ర్యాలీలు మోడీ -ట్రంప్ మధ్య స్నేహాన్ని ప్రదర్శించాయి. కానీ, ఇవి దేశప్రయోజనాలకు బదులు బిజెపి పార్టీ ఇమేజ్‌కు మాత్రమే ఉపయోగపడ్డాయి. ఇప్పుడు, రష్యా నుంచి చవకైన ఆయిల్ కొనుగోళ్లు అమెరికాను రెచ్చగొట్టాయి. భారత్ 2024లో రష్యా నుంచి 53 బిలియన్ డాలర్ల ఆయిల్ కొనుగోలు చేసింది. ఇది గ్లోబల్ మార్కెట్ ధరల కంటే 20- 30 శాతం తక్కువ.

అయితే, ఈ లాభాలు సామాన్యులకు ఏమాత్రం చేరలేదు. ముడి ఆయిల్ బ్యారెల్ ధర 80 డాలర్లుగా ఉన్నప్పుడు కూడా పెట్రోల్ లీటరుకు రూ. 110 ఉంది. గత యుపిఎ ప్రభుత్వంలో 150 డాలర్ల ధరకు 60 రూపాయలుగానే ఉండేది. ఈ వ్యత్యాస లాభాలను మోడీ ప్రభుత్వం ప్రైవేట్ రిఫైనరీలు రిలయన్స్, నయారా వంటి కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం భారత ప్రజలను నిలువునా దోచి వాళ్ళ అభివృద్ధి కోసం పంచిపెడుతుందీ అని విశ్లేషకులు చెప్తున్నారు. ఇది మోడీ ప్రభుత్వం వ్యాపార ఆప్తులు అదానీ, అంబానీల కంపెనీలకే లాభాలు తేవటానికి అనుకూలంగా ఉందనే విమర్శలకు దారితీస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వాల విదేశాంగ విధానం దీనికి పూర్తి విరుద్ధం. నెహ్రూ అలీనత్వం ద్వారా భారత్‌ను గౌరవప్రదమైన స్థానంలో నిలిపారు. మన్మోహన్ సింగ్ 2008లో అమెరికాతో అణు ఒప్పందం చేసి ఆర్థిక సంస్కరణలు తెచ్చారు.అప్పుడు రష్యా, అమెరికాతో సమానంగా అశేష ప్రజానీకం అభివృద్ధి కోసమే విదేశాలతో సంబంధాలు కొనసాగాయి.మోడీ పాలనలో మాత్రం పొరుగు దేశాలతో ఉద్రిక్తతలు పెరిగాయి. బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు భారత్‌తో సంబంధాలు చెడిపోయాయి. అవి పూర్తిగా భారత్ పట్ల శత్రుభావనలో ఉన్నాయి. ఇటీవల ట్రంప్ సుంకాలు భారత్‌ను చైనా, రష్యాల వైపు నెట్టాయి. షాంఘై సహకార సంస్థ సమావేశం (ఎస్‌సిఇఒ) మోడీ, -పుతిన్, జీ -జిన్‌పింగ్ సమావేశాలు ఇందుకు సాక్ష్యం. ఇది మల్టీపోలార్ వరల్డ్ భారత్ స్వతంత్రతను చూపుతుంది. కానీ ఇప్పుడు మోడీ అమెరికా ఒత్తిడికి లొంగకుండా ఉండటం కీలకం.

# తీర్పులపై వక్రభాష్యాలు..



సల్వాజుడుం అంటే గోండు భాషలో శాంతియాత్ర అని అర్థం. ఇంగ్లీషులో పీస్ మార్చ్.. అంటే శాంతి సాధన కోసం జరిపే కవాతు అనుకోవాలి. గిరిజన తెగలు మాట్లాడుకునే స్థానిక భాషల్లో ఒకటైన గోండులో ఇది సల్వాజుడుం అని అర్థం కానీ చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని రమణసింగ్ ప్రభుత్వం మాత్రం దీన్ని ఆ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలైన బస్తర్, దంతేవాడ వంటి చోట్ల శాంతిసాధన కోసం ప్రయోగించలేదు. అక్కడ బలంగా ఉన్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడానికి ఆనాటి చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక ప్రైవేట్ ఆర్మీ సల్వాజుడుం.2005 నుంచి 2011 దాకా దాదాపు ఆరు సంవత్సరాలు ఈ సల్వాజుడుం చేసిన ఘనకార్యం ఏమిటంటే ఆ ప్రాంతాల్లో మారణకాండకు కారకులు కావడం, అక్కడ నివసిస్తున్న గిరిజనుల మీదకు గిరిజనులనే పురిగొల్పడం కోసం ఏర్పడిన ఒక రాజ్యాంగేతర, చట్ట వ్యతిరేక వ్యవస్థ. సల్వాజుడుం ఏర్పడిన తర్వాత దానిని సుప్రీంకోర్టు రద్దు చేసేవరకు ఆ ప్రాంతంలో జరిగిన మారణకాండలో 1019 మంది గ్రామస్థులు, 42 మంది మావోయిస్టులు, 726 మంది భద్రతా బలగాలకు సంబంధించినవారు హతమయ్యారని, దాదాపు 55 వేల మంది గిరిజనులు పొరుగున ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వలసపోయారని అధికారిక లెక్కలే చెపుతున్నాయి. నందిని సుందర్ అనే ఒక మహిళా యాక్టివిస్ట్ వేసిన కేసులో జులై 5, 2011న సుప్రీం కోర్టు సల్వాజుడుంను వెంటనే రద్దు చెయ్యాలని తీర్పు ఇవ్వకపోయి ఉంటే ఇంకెంత మారణహోమం జరిగి ఉండేదో.

అటు ఇటు ఇంకా ఎన్ని వందల, వేల గిరిజనుల ప్రాణాలు పోయి ఉండేవో చెప్పనవసరం లేదు. ఈ తీర్పు వెలువరించిన ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్. ఈ ఇరువురూ తమ తీర్పులో సల్వాజుడుమనేది ఒక చట్ట వ్యతిరేక రాజ్యాంగ వ్యవస్థ కాబట్టి దాన్ని మూసివేయాల్సిందేనని తీర్పునిచ్చారు. అంతేకాదు, సల్వాజుడుం దగ్గర ఉన్న మారణాయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర పరికరాలన్నీ స్వాధీనం చేసుకోవాలని అప్పటి చత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సల్వాజుడుం వల్ల జరిగాయని ఆరోపణలు ఉన్న నేరాలన్నిటిమీద దర్యాప్తు కూడా జరపాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇరువురూ తీర్పు చెప్పారు. సల్వాజుడుంలో చేరినవారందరికీ ప్రత్యేక పోలీస్ అధికారి హోదా కల్పించారు. వారి విద్యార్హత ఐదవ తరగతి వరకు మాత్రమే. ఈ తీర్పు వెలువరించిన న్యాయమూర్తుల్లో ఒకరైన సుదర్శన్ రెడ్డి మరో తీర్పు కూడా ఇచ్చారు. మావోయిస్టు ఉద్యమం ప్రబలంగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలలో శిబిరాలు ఏర్పాటు చేసుకుని ఉన్న ప్రత్యేక పోలీసు దళాలను వెంటనే ఖాళీ చేయించాలని. మావోయిస్టుల అణచివేత పేరిట పాఠశాలలు, కళాశాలలు ఆక్రమించుకోవడం కుదరదని స్పష్టంగా తీర్పు చెప్పింది.సల్వాజుడుం వంటి సంస్థలు అప్పట్లో చత్తీస్ గఢ్ ప్రజలకు కొత్తేమో కానీ మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగిన రోజుల్లో తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ వంటి ప్రాంతాల ప్రజలకు మరో రూపంలో ఎంతో అనుభవంలో ఉన్నదే. ఒక ఉదాహరణ చెప్పుకోవాలంటే 1986 ప్రాంతాల్లో అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం బలంగా ఉన్న కరీంనగర్‌లో పోలీసు సూపరింటెండెంట్ స్వయంగా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన అన్నెబోయిన మల్లయ్య అనే వ్యక్తి నాయకత్వంలో కొంతమంది ముఖాలకు ముసుగేసి తన క్యాంపు కార్యాలయంలోనే 'ఫియర్ వికాస్' అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటింపజేశారు. నక్సలైట్లను ఎదుర్కోవడానికి, కట్టడి చేయడానికి, హతమార్చడానికి ఉద్దేశించి తాము ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పత్రిక సమావేశంలో మల్లయ్య చెప్పారు. ఇలా పోలీసుల ప్రోత్సాహంతో మరికొన్ని ఇటువంటి సంస్థలు పుట్టుకొచ్చాయి. 'గ్రీన్ టైగర్స్' వంటిది వాటిలో బాగా ప్రచారంలోకి వచ్చిన సంస్థ. కొంతమంది ప్రభుత్వానికి లొంగిపోయిన మాజీ తీవ్రవాదులను కూడా ప్రభుత్వాలు పీపుల్స్ వార్ ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు వాడుకున్నాయి.అలాంటి ప్రయత్నం లో భాగంగానే కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు, బయపు సమ్మిరెడ్డి, నయీముద్దీన్ వంటి మాజీ నక్సలైట్లు పోలీస్ శాఖలో అల్లుళ్లలాగా సౌకర్యాలు పొంది, ప్రభుత్వం కోసం పనిచేసిన విషయం తెలిసిందే. ఏకు మేకు అయి కూర్చున్న అటువంటివారిని వదిలించుకోవడానికి ఆ తరువాత వాళ్ళ సృష్టికర్తలు పడిన పాట్లు కూడా అందరికీ తెలిసినవే. బహుశా 80వ దశకంలో తెలంగాణలో జరిగిన ఈ ప్రయత్నాలన్నిటి స్ఫూర్తితోనే 2005లో సల్వాజుడుం ఏర్పడిందేమో. కానీ ఈ సంస్థలు, వ్యక్తులూ చేయలేకపోయినంత హింస సల్వాజుడుం అస్తిత్వంలో ఉన్న చాలా స్వల్ప కాలం, ఐదారు సంవత్సరాలలోనే జరిగింది. సల్వాజుడుంకు నాయకత్వం వహించిన మహేంద్రకర్మ, అంతకు ముందు ఫియర్ వికాస్ కు నాయకత్వం వహించిన అన్నెబోయిన మల్లయ్య ఇద్దరూ ఆ తర్వాత కాలంలో హత్యకు గురయ్యారు. ఇటువంటి రాజ్యాంగేతర, చట్టవ్యతిరేక వ్యవస్థల్ని సృష్టించినవారు పెద్దగా సాధించింది ఏమీ లేదు, అమాయక ప్రజలు.. అందునా పెద్దసంఖ్యలో పేద గ్రామస్తులు, గిరిజనులు హింసాత్మక ఘటనల్లో మరణించడం తప్ప. ఇప్పుడు సల్వాజుడుం ప్రస్తావన తీసుకురావడానికి కారణం ఆ సంస్థను మూసివేయాలని తీర్పు ఇచ్చిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం జరగబోతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి తరఫున పోటీకి దిగడం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించగా ఆ పార్టీ నాయకత్వంలో ఉన్న ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ సమర్థిస్తున్నాయి.

మొత్తం లోకసభ, రాజ్యసభ సభ్యులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నిక ఫలితం అందరికీ తెలిసిందే. ఇదొక సిద్ధాంతపరమైన పోటీయే. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ నిపుణులు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏ రాజకీయ పక్షానికీ చెందినవారు కాదు. నిజానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్, శాసనసభల స్పీకర్లు వంటి పదవుల్లో రాజకీయాలతో సంబంధంలేని వారిని నియమిస్తే నిష్పక్షపాతంగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. అయితే ఆ పరిస్థితి ఎప్పుడో పోయింది. ఇప్పుడు స్పీకర్లు, గవర్నర్లు, ఉపరాష్ట్రపతులు, రాష్ట్రపతుల పదవులను రాజకీయ పార్టీల నాయకులే అధిష్టిస్తున్నారు.ఎవరినీ నమ్మించలేని ఆరోగ్య కారణాలు చూపించి అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి కనీసం అధికారికంగా వీడ్కోలుకు కూడా నోచుకోకుండా జగ్దీప్ ధన్‌ఖడ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా మాయమైన కారణంగా ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నిక అవసరం ఏర్పడింది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ తన అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ వ్యక్తి సిపి రాధాకృష్ణన్‌ను ఎంచుకున్నది.కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి మాత్రం రాజ్యాంగ నిపుణుడు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, ఎంతో అనుభవం కలిగిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేసుకున్నది. ఇది కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు నచ్చలేదు. ఆయన సల్వాజుడుం విషయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి 2011లో ఇచ్చిన తీర్పును.. అంటే దాదాపు పద్నాలుగు సంవత్సరాల తర్వాత ఇప్పుడు ప్రస్తావించి ఆయన నక్సలైట్లకు అనుకూలుడని, ఆయన ఆ తీర్పు ఇచ్చి సల్వాజుడుంను రద్దు చేయించకపోయి ఉంటే 2020లోనే తాము నక్సలిజాన్ని అంతం చేసి ఉండేవాళ్ళమని వ్యాఖ్యానించారు. ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్టు సమాజంలో అసమానతలు ఉన్నంతవరకూ ఆ ఉద్యమాలను అంతం చెయ్యడం సాధ్యం కాదన్న విషయం, తేదీలు ఖరారు చేసి మరీ నక్సలిజాన్ని అంతం చేస్తానని అత్యున్నతమయిన ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటులోనే ప్రకటించిన అమిత్ షా వంటి వారికి ఎవరు చెప్పగలరు?.అంతేకాదు, ప్రత్యేక పోలీసు దళాలు పాఠశాల భవనాల్ని, కళాశాల భవనాలను ఇతర ప్రభుత్వ భవనాలను ఆక్రమించుకోవడంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి మరో తీర్పు ఇచ్చారు. ఇది ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన విద్యా హక్కుకు భంగం కలిగించడమేనని ఇచ్చిన తీర్పు కూడా సాక్షాత్తు ఈ దేశ హోం మంత్రికి నచ్చలేదు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఏ రాజకీయ పక్షానికీ చెందినవారు కాదు. ఆయన ఒక రాజ్యాంగం నిపుణుడు. ప్రజాస్వామ్యవాది. మానవతా విలువలు కలిగినవారు. లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ సిద్ధాంతాలకు ప్రభావితుడైనవారు. జయప్రకాశ్ నారాయణ అనుయాయులంతా తీవ్రవాద సమర్థకులే అయితే ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ మీద పోరాటం చేసి విజయం సాధించి, ఆయన తెచ్చిన జనతా ప్రభుత్వంలో తమ పూర్వాశ్రమం అయిన జనసంఘీయులు ఎందుకు పాలు పంచుకున్నారో అమిత్ షా చెప్పాలి. అంతెందుకు, 2013 మార్చిలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి గోవాకు తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి, బిజెపి నేత మనోహర్ పారికర్ కూడా హాజరయ్యారు. సుదర్శన్ రెడ్డి నక్సలైట్లకు మద్దతు ఇచ్చారన్న మాటే నిజమైతే, మరి అప్పుడు గోవాలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం తెలపలేదనే ప్రశ్నకు కమలనాథులు ఏం సమాధానం చెబుతారు?.సుదర్శన్ రెడ్డి హింసను ఎక్కడా సమర్థించిన లేదా ప్రోత్సహించిన సందర్భాలు లేవు. సల్వాజుడుంను నిషేధిస్తూ ఇచ్చిన తీర్పులో వారు ప్రభుత్వానికి హింస అనే బెడదను ఎదుర్కొనే సంపూర్ణ హక్కు ఉందని, ఆ హక్కును అవుట్ సోర్స్ చేయడం సరికాదని స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాదు, హింసను ఎదుర్కోవడం అనేది ప్రభుత్వానికి రాజ్యాంగపరమైన బాధ్యత అని కూడా ఆ తీర్పులో పేర్కొన్నారు. హింస మీద పోరాటం చేస్తున్నామన్న నెపంతో ఇంకొక హింసాత్మక వ్యవస్థను ఏర్పాటు చేయడం, ప్రోత్సహించడం సమంజసం కాదని కూడా ఆ తీర్పులో పేర్కొన్నారు. అలా చేయడం వల్ల ప్రజలు రెండు గుంపులుగా విడిపోయి పోరాడుకునే పరిస్థితి వచ్చి హింస మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు.అటువంటి తీర్పు వెలువరించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి తమకు వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు

# భారత వాణిజ్యానికి ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ



%భారత ఎగుమతులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన మొత్తం 50% సుంకాలు బుధవారం (ఆగస్టు 27) నుంచి అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న సాకుతో భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన 25 శాతం అదనపు సుంకాలతోపాటు ఇప్పటికే ప్రకటించిన 25% సుంకాలు మొత్తం 50 శాతం సుంకాల భారం మన ఎగుమతులపై పడింది. దీనివల్ల 47 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఉత్పత్తులు 50 శాతం టారిఫ్‌ను ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల అమెరికా మార్కెట్లో చాలా వరకు భారతీయ ఉత్పత్తులకు చోటులేకుండా పోతుందన్న ఆందోళన వాణిజ్యరంగంలో ఎక్కువగా ఉంటోంది. మనకన్నా తక్కువ సుంకాలు వర్తించే బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, కాంబోడియా, ఇండోనేషియా వంటి దేశాలతో పోటీపడే పరిస్థితి ఉండకపోవచ్చు.భారత్‌పై విధించిన సుంకాల కన్నా చైనా (30 శాతం), వియత్నాం (20 శాతం). ఇండోనేషియా (19 శాతం), జపాన్ (19 శాతం) దేశాలకు సుంకాల భారం తక్కువ. అదనపు సుంకాల భారంతో 202526లో అమెరికాకు భారత ఎగుమతులు రూ. 4.34 లక్షల కోట్ల అంటే 49.6 బిలియన్ డాలర్ల మేరకు పడిపోవచ్చుని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జిటిఆర్ఐ) సంస్థ అంచనాగా వెల్లడించింది. 2024 2025లో భారత్ అమెరికా మధ్య సుమారు 11.5 లక్షల కోట్ల (131.8 బిలియన్ డాలర్ల) వాణిజ్యం జరిగింది. ఇందులో భారత్ నుంచి రూ.7.57 లక్షల కోట్ల (86.5 బిలియన్ డాలర్ల) ఎగుమతులు జరగ్గా, రూ. 4 లక్షల కోట్ల (45.3 బిలియన్ డాలర్ల) మేర దిగుమతులు జరిగాయి.ప్రస్తుతం 50% టారిఫ్‌లతో భారత్ నుంచి జరిగే రూ. 5.25 లక్షల కోట్ల ఎగుమతులపై ప్రభావం పడుతుందని వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ అధిక సుంకాల కారణంగా అమెరికాలో భారత ఉత్పత్తుల ధరలు ఏకంగా 50 శాతం పెరిగిపోతాయి. గత ఏడాది భారత్ నుంచి ఎగుమతులు 91.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. కానీ ఈసారి అమెరికాకు 60 శాతం ఎగుమతులపై అంటే దాదాపు 60.2 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తుపై ప్రభావం పడుతుందని వాణిజ్యవర్గాలు పేర్కొంటున్నాయి. అయితే త్వరలో రాబోయే జిఎస్‌టి సంస్కరణలు ఈ టారిఫ్‌ల ప్రభావాన్ని భర్తీ చేయవచ్చుని పిచ్ సొల్యూషన్స్ కంపెనీ బిఎంఐ గురువారం వెల్లడించింది. సుంకాలతో కొన్ని రంగాలు దెబ్బతినే అవకాశం ఉన్నప్పటికీ భారత జిడిపి వృద్ధిరేటు మాత్రం 6% పైనే ఉంటుందని బిఎంఐ అంచనా వేసింది.

మన ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకే అమెరికా ఇటువంటి చర్యలకు దిగుతోందని ది చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ అభిప్రాయపడింది. ఏదేమైనా మన దేశంలోని రొయ్యలు, మత్స్య పరిశ్రమ, పాడి పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులతోపాటు రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు, దుస్తులు, కార్పెట్లు, హస్తకళా ఖండాలు, తోలు, పాదరక్షలు తదితర చేతివృత్తులకు కూడా విపరీతమైన నష్టం ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు 2.4 బిలియన్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయ్యాయి. మొత్తం రొయ్యల ఎగుమతుల్లో 32.4% అమెరికాకు ఎగుమతి అవుతోంది.ప్రధానంగా విశాఖ పట్టణం కేంద్రంగా తూర్పు తీరప్రాంతాల నుంచి అమెరికాకు సుమారు రూ. 20 వేల కోట్లకు పైగా విలువైన రొయ్యలు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు ఈ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతుంది. అమెరికాకు 10 బిలియన్ డాలర్ల రత్నాలు, ఆభరణాలు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు ఇందులో సగానికి సగం తగ్గిపోవచ్చు. ముంబై, సూరత్ వేదికగా ఉన్న రత్నాలు, ఆభరణాల పరిశ్రమల నుంచి రూ. 87వేల కోట్ల విలువైన ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి 10.8 బిలియన్ల విలువైన వస్త్రాలు, దుస్తులు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. భారత దేశ దుస్తుల ఎగుమతుల్లో అమెరికా వాటా 35 శాతంగా ఉంటోంది. తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటకల నుంచి ఎగుమతి అయ్యే రూ. 95 వేల కోట్ల వస్త్రాల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉంది.సుంకాలు 13.9 శాతం నుంచి 63.9 శాతానికి పెరగడంతో తిరుప్పూర్, నోయిడాగురుగ్రామ్, బెంగళూరు, లూథియానా, జైపూర్‌ల్లో వస్త్రపరిశ్రమలపై తీవ్రప్రభావం పడుతుంది. తిరుప్పూర్, నోయిడా, సూరత్‌లోని దుస్తుల తయారీ సంస్థలు అప్పుడే ఉత్పత్తిని నిలిపివేశాయి. 2025లో అమెరికాకు భారత్ నుంచి 1.2 బిలియన్ల విలువైన కార్పెట్లు ఎగుమతి అయ్యాయి. అమెరికాలో భారత్ కార్పెట్ల ఎగుమతులు 58.6 శాతం వాటాను కలిగి ఉన్నాయి. దీనివల్ల మీర్జాపూర్, శ్రీనగర్‌ల్లో చేతివృత్తులకు ముప్పు తప్పదు. హస్తకళల ఉత్పత్తులు అమెరికాకు దాదాపు 40 శాతం ఎగుమతి అవుతుంటాయి. 2025లో అమెరికాకు 1.6 బిలియన్ డాలర్ల విలువైన హస్తకళల ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.జోథ్‌పూర్, జైపూర్, మురాదాబాద్, సహారన్‌పూర్‌ల్లోని హస్తకళల పరిశ్రమలకు నష్టం కలుగుతుంది. అమెరికాకు భారత్ నుండి దాదాపు 1.2 బిలియన్ డాలర్ల విలువైన తోలు, పాదరక్షల ఎగుమతులు అవుతుంటాయి. ఇప్పుడు ఆగ్రా, కాన్పూర్, తమిళనాడులోని అంబూర్ రాణిపేట్ పరిశ్రమలు దెబ్బతింటాయి. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై స్పష్టత వచ్చేవరకు ఉత్పత్తిని నిలిపివేస్తామని, సిబ్బందిని తగ్గించుకుంటామని తోలు, పాదరక్షల పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. భారతదేశం నుంచి 6 బిలియన్ డాలర్ల విలువైన బాస్మతి బియ్యం, సుగంధ ద్రవ్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు ఈ ఎగుమతులు సగానికి సగం తగ్గిపోవచ్చు. దీనివల్ల పాకిస్తాన్, థాయ్‌లాండ్, వియత్నాం, కెన్యా, శ్రీలంక, అమెరికా డిమాండ్లను చేజిక్కించుకోవచ్చు.

# ఫ్లాట్ అవ్వాల్సిందే!








కొన్ని దుస్తులు, ఇంకొన్ని ఆభరణాలు, మరికొన్ని యాక్సెసరీస్.. చూడగానే ఫ్లాట్ అయిపోతాం. మనవే అనిపించుకునేదాకా కుదుటపడదు మనసు. కానీ ఎప్పుడూ మనమే ఫ్లాట్ అవ్వడం కాదు, మనకోసం ఫ్లాట్ అయిపోయే నగలూ ఉన్నాయి. అవే.. 'ఫ్లాట్ చెయిన్ నెక్లెస్'లు. విభిన్న పెండెంట్లు, రకరకాల డిజైన్లతో తయారవుతున్నాయా కంఠాభరణాలు అందంగా ఉండటం, విభిన్నంగా కనిపించడం%ొా% కొత్త నగకు ఉండాల్సిన ముఖ్య లక్షణాలు. ఈ రెండూ ఉంటేనే మహిళాబోర్డు పరీక్షలో మంచి మార్కులు పడతాయి ఆభరణానికి. అప్పుడే వాటి కరిక్యులమ్ వీటాకి బలం కూడా. మలి రౌండ్‌లో నెగ్గుకొచ్చి మార్కెట్ జోరును అందుకునే అవకాశమూ వాటికే. అచ్చంగా ఆ అర్హతలన్నీ ఉన్నాయి ఫ్లాట్ మెష్ చెయిన్ నెక్లెస్‌లకు. మెడను అలంకరించే గొలుసు పల్చగా, వెడల్పుగా ఉండటం ఇందులోని ప్రత్యేకత. అంటే సాధారణంగా మనం చూసే గొలుసుల్లా గుండ్రం గానో, డిజైన్లతో ఉబ్బెత్తుగానో కాకుండా.. చదరంగా ఉండటం వల్ల ఇవి ఫ్లాట్ నెక్లెస్‌లు అయ్యాయన్నమాట. పై మెడకు పెట్టుకునేలా చోకర్ తరహాతో పాటు, ఇంకాస్త కిందికి ధరించే నెక్లెస్‌లా కూడా రూపొందుతున్నాయి. సాదా చెయిన్‌కు పెద్ద పెండెంట్%ొా% దానికి సరిపోయే జుంకాలతో వచ్చేవి కొన్నయితే, గొలుసు మీద మామిడి పిందెలు, పువ్వుల్లాంటి బంగారు మోటిఫ్స్‌తో వచ్చేవి మరికొన్ని. లాకెట్లలో సంప్రదాయ డిజైన్లలో కనిపించే నెమళ్లూ, లక్ష్మీదేవి రూపుల్లాంటివీ ఉంటున్నాయి. బంగారంలో వజ్రాలు, రత్నాలు, ముత్యాలు పొదిగి చూడముచ్చటైన డిజైన్లలో దొరుకుతున్నాయి కూడా. చెయిన్ వెనుక హుక్ పెట్టుకునే భాగంలో డిజైన్లు వచ్చేలా ప్రత్యేకంగానూ తయారు చేస్తున్నారు. ఫ్లాట్ నెక్లెస్ మిమ్మల్నీ ఫ్లాట్ చేసిందా?

# ఆరు గజాల అనుబంధం.. 6 యార్డ్స్ ప్లస్





కంచి పట్టు కట్టుకుంటే, పట్టుపురుగు జన్మ ధన్యం అవుతుంది. పోచంపల్లి చుడితే నూలుపోగుకు ప్రాణం లేచొస్తుంది. చందేరీలో అయితే చంద్రబింబమే. ఉప్పాడ కట్టుబడికి కుర్రకారు గుండెదడ పెరగడం ఖాయం. షిఫాన్‌లో ముస్తాబైతే నచ్చినవాడి ఎదలో పెను తుఫానే.కాకపోతే, ఆ అలంకరణ ఏ పెండ్లికో, పండగకో పరిమితం అవుతున్నది. కొత్తతరం అమ్మాయిలు.. ప్రత్యేక సందర్భాల్లోనూ చీరను దూరం పెడుతున్నారు. ఈ ధోరణి మృణాళిని శాస్త్రిని బాధపెట్టింది. ఆమె స్థాపించిన '6 యార్డ్స్ ప్లస్'.. చీరకట్టును యువతులకు దగ్గర చేస్తున్నది.నార చీర నుంచి పట్టు చీర వరకు దేని అందం దానిదే. ఎన్ని మాడ్రన్ డ్రెస్సులు వచ్చినా చీరకట్టుకు మించిన సోయగం లేదని తేలిపోయింది. కాకపోతే, చీరను సంప్రదాయ వేడుకలకే పరిమితం చేస్తున్నది నేటి తరం. దీంతో ఆ వైభవం మసకబారుతున్నది. చీర పట్ల ఉన్న అపోహలను, చీరకట్టు విషయంలో ఉన్న భయాలను పోగొట్టి.. గత వైభవం తీసుకురావాలన్నది '6 యార్డ్స్ ప్లస్' ఫౌండర్ మృణాళిని శాస్త్రి లక్ష్యం. వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ చీరలను పరిచయం చేస్తూనే.. ఆరు గజాల చీరల సంస్కృతిని ఒక ఫ్యాషన్‌గా ప్రచారం చేస్తున్నారామె. మరోపక్క 'శారీ రివైవల్' ప్రణాళికతో పాతతరం చీరలకు కొత్త సొబగులు అద్ది భవిష్యత్ తరాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. మృణాళిని ఎంబీఏ చేశారు. కొంతకాలం ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోల తరఫున పని చేశారు. కానీ ఎక్కడో అసంతృప్తి. తన కల వేరు, చేస్తున్న కొలువు వేరు అనిపించింది. దీంతో తన అభిరుచినే కెరీర్‌గా ఎంచుకున్నారు. ఫ్యాబ్రిక్ రంగం వైపు అడుగులు వేశారు. %చిన్నతనంలో వేడుక ఏదైనా సరే, అమ్మ తనకు చీర చుట్టేసేది. దీంతో చీరతో పరిచయం, స్నేహం, బంధం.. అన్నీ కుదిరేశాయి. పెద్దయ్యాక కూడా ఆ ప్రేమ తగ్గలేదు. ఆఫీసుకు వెళ్లినప్పుడూ చీరలే కట్టేవారామె. ఆ మక్కువ కొద్దీ ఐదేండ్ల క్రితం.. '6 యార్డ్స్ ప్లస్' ప్రారంభించారు. పండుగ పబ్బాల వరకూ ఫర్వాలేదనిపించినా.. మిగతా సమయాల్లో చీరలు కాళ్లకు అడ్డుతగులుతాయని యువతుల భయం. కానీ అలవాటైతే చీరకట్టును మించిన సౌకర్యం లేదని భరోసా ఇస్తున్నారు మృణాళిని. 'కెరీర్ మహిళను హుందాగా చూపడంలో చీరల తర్వాతే.. ఏ దుస్తులైనా' అంటారామె.



**ట్రెండ్సెట్టర్‌లిష్‌గా..** వైవిధ్యమైన చీరకట్టుతో అందరినీ ఆకట్టుకుంటారు మృణాళిని. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన చీరకట్టు ఉంటుంది. ఎవరి సంస్కృతికి తగినట్టు వారు చీరలు కట్టుకుంటారు. పొలం పనులకు వెళ్లేటప్పుడు ఒకలా, పూజల సమయంలో ఒకలా ధరిస్తారు. ఇవే కాదు, ఇంకా చాలా కట్టుబడులు ఉన్నాయి. వాటన్నిటిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు మృణాళిని. కుచ్చిళ్లు పెట్టుకోవడం తెలియని వారికి ప్రాథమిక పాఠాలు బోధిస్తారామె. క్షణాల్లో ముస్తాబు కావడానికి రెడీమేడ్ చీరలనూ రూపొందిస్తారు.

**'శారీ రివైవల్' ప్రోగ్రామ్**



చీర ఓ మధుర జ్ఞాపకం. బీరువాలో కొలువైన ఒక్కో చీరతో ఓ అనుభూతి ముడిపడి ఉంటుంది. దాని వెనుక ఏదో ఓ కథ ఉంటుంది. అవన్నీ భవిష్యత్ తరాలకు తెలిసేలా 'శారీ రివైవల్' ప్రోగ్రామ్ ప్రారంభించారు. పాత చీరల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు మృణాళిని. బంజారాహిల్స్ కమలాపురి కాలనీలోని '6 యార్డ్స్ ప్లస్' ఆవరణలో పాత చీరలను కొత్త డిజైన్లతో తీర్చిదిద్దుతున్నారు. అంతెందుకు.. గోవా 'కుంచీ' చీరలు, సిద్ది పేట 'ముత్యంగడి' చీరలు పైకి నిరాడంబరంగా కనిపించినా రాజసాన్ని ప్రదర్శిస్తాయి. మార్కెట్‌లో అరుదుగా దొరికే ఈ చీరలకు కొత్త హంగులు అద్ది అందిస్తారామె. కాబట్టే ఆ చీరలు విదేశాలకూ వెళు తున్నాయి. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నారు. 'చీరకు ప్రాణంపోయడంలో ఎంతో మంది కళాకారుల శ్రమ దాగి ఉంటుంది. ఆ గొప్పతనం పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనదే. అప్పుడే వాళ్లు చీరతో అనుబంధాన్ని పెంచుకోగలరు' అంటారు మృణాళిని. ఆమె ఆంత్రప్రెన్యూర్‌షిప్ కలలకు 'వీ హబ్' మద్దతు పలికింది. నెట్ వర్కింగ్ అందించింది. మార్కెటింగ్ మెళకువలు నేర్పింది. వ్యాపార విస్తరణకు దోహదపడింది. విజయానికి సాయపడింది.

చిన్న యసులోనే పెండ్లి. పెద్ద చదువు ఆలోచనకు బ్రేక్ పడింది. ఇల్లు, భర్త, పిల్లలే లోకంగా బతికింది. ఆరేండ్ల తర్వాత ఊపిరి పీల్చుకునే అవకాశం వచ్చింది. తిరిగి చదువు కొనసాగించింది. ప్రైవేటు టీచర్‌గా పిల్లలకు పాఠాలు బోధించింది. ట్యూటర్‌గానూ పనిచేసింది. అయినా, ఎదుగూ బొదుగూ లేని జీవితం. ఆదాయం విషయంలోనూ అంతులేని అసంతృప్తి. వ్యాపారం చేద్దామన్నది ఒకప్పటి కల. కానీ ఆర్థిక పరిస్థితులు అడ్డొచ్చాయి. అన్ని తలుపులూ మూసుకుపోయి, అన్ని ఆశలూ ఆవిరైపోయి.. తన ఉనికే ప్రశ్నార్థకమైందని బాధపడుతున్న సమయంలో 'దళిత బంధు' కాంతిరేఖలా కనిపించింది. 'వీ హబ్' ఆమెను పారిశ్రామిక వేత్తగా నిలబెట్టింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన నీరేటి మౌనిక విజయ ప్రస్థానమిది.%కొన్ని జీవితాల్లో సినిమాలను తలపించే మలుపులు ఉంటాయి. స్ఫూర్తి కథనాలను గుర్తుకుతెచ్చే విజయాలూఉంటాయి. తనకంటూ ఓ రోజు వస్తుందనీ, దర్జాగా వ్యాపారం చేసుకుంటాననీ నీరేటి మౌనిక కలలో కూడా ఊహించి ఉండదు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని సింగాపూర్ తన స్వగ్రామం. చిన్నతనంలోనే పెండ్లయింది. అప్పటికి తను ఇంటర్ చదువుతున్నది. ఆ తర్వాత, డిగ్రీ చేయాలనీ, వీలైతే ఎంబీయే పట్టా అందుకోవాలనీ ఆమె స్వప్నం. కానీ, వివాహంతో ఆమె కలల రెక్కలు తాత్కాలికంగా తెగిపోయాయి.

# కొంగొత్త జీవితం..

కొంతకాలానికి పరిస్థితులు సర్దుకున్నాయి. చిన్నప్పటి నుంచీ చదువుపై ఉన్న ఆసక్తితో తిరిగి చదువు కొనసాగించింది. డిగ్రీ పూర్తి చేసింది. భర్త చిరుద్యోగి. ఇద్దరు పిల్లలు. కుటుంబానికి ఆసరాగా కొంతకాలం ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేసింది. ప్రతినిత్యం గంటల తరబడి నిలుచునే పాఠాలు చెప్పడం వల్ల వెన్ను నొప్పి, సయాటికా వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో టీచర్ ఉద్యోగాన్ని వదిలేసిం ది. ఇంట్లోనే ట్యూషన్స్ చెప్పింది. ఈ ఆదాయమూ అంతంత మాత్రమే. మనసులో ఏదో వెలితి. సొంతంగా ఏదైనా వ్యాపారం చేద్దామంటే పెట్టుబడి పెట్టే స్తోమత లేదు. ఈ పరిస్థితుల్లో 'దళిత బంధు' పథకం మౌనికకు బాసటగా నిలిచింది.

**'వీ హబ్' మార్గనిర్దేశంలో..** ఎంతోమంది గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన 'వీ హబ్' వేదిక.. దళితబంధు లబ్ధిదారులకూ మార్గనిర్దేశం చేసింది. దళితబంధుకు ఎంపికైనవారిలో ఔత్సాహిక మహిళలను గుర్తించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. ఇదే క్రమంలో మౌనికకూ 'వీ హబ్' తోడ్పాటు అందించింది. ఏ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలనే విషయంలో మౌనిక తర్జనభర్జన పడింది. కిడ్స్‌వేర్ దుకాణం నడపాలని తొలుత భావించింది. ఆమె భర్తకు డ్రైవింగ్ తెలుసు. దీంతో ట్యాక్సీ కొనాలనే ఆలోచనా వచ్చింది. ఆ సమయంలోనే వీ హబ్ ఓరియంటేషన్ సెషన్‌కు హాజరైంది. అక్కడే తనకంటూ ఓ స్పష్టత వచ్చింది. వ్యాపారం ద్వారా కుటుంబ ఆదాయం పెరిగి తన కాళ్లమీద తాను నిలబడగలనని భావించింది. వ్యాపారం బాగా నడిస్తే.. ఎప్పుడైనా ట్యాక్సీ కొనుగోలు చేయవచ్చని భర్తకు నచ్చ జెప్పింది. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, స్టేషనరీ షాప్ పెట్టుకోవాలని సంకల్పించింది. కంప్యూటర్ ఎంబ్రాయిడరీలో శిక్షణ కూడా తీసుకుంది. యూనిట్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, యంత్రాల కొనుగోలు, కొటేషన్ల ధ్రువీకరణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆమోదం, మార్కెటింగ్ తదితర అంశాల్లో 'వీ హబ్' ఆమెకు అండగా నిలబడింది. ప్రతిదశలోనూ నడిపించింది.

**నెరవేరిన 'కల'..** మౌనిక వ్యాపార స్వప్నాన్ని 'దళితబంధు' నెరవేర్చింది. ఆమె జీవితంలో కొత్త వెలుగులు తెచ్చింది. ఉపాధి కోసం మౌనిక కుటుంబం ఘట్‌కేసర్ ప్రాంతానికి వలస వచ్చి ఉంటున్నది. దీంతో ఈ ప్రాంతంలోనే కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, స్టేషనరీ షాప్‌ను ఏర్పాటుచేసుకుని ఆత్మగౌరవంతో బతుకుతున్నది. ట్యూటర్‌గా ఉన్నరోజుల్లో కనాకష్టంగా నెలకు నాలుగువేలు సంపాదించిన చేతులతోనే.. వ్యాపారాన్ని ప్రారంభించిన నాటి నుంచే నెలకు రూ.10వేలకు పైగా ఆర్జిస్తున్నది. బతకడానికి గతంలో ఎన్నో కష్టాలు పడ్డామని, జీవితం ఇంత బాగుంటుందని కలలో కూడా అనుకోలేదని మౌనిక సంబురంగా చెబుతున్నది. ఇద్దరు అమ్మాయిలను బాగా చదివిస్తానని వివరించింది. త్వరలోనే వ్యాపారాన్ని మరింతగా విస్తరించుకుంటానని వెల్లడించింది. అవును, ఒక విజయంతోనో, ఒక మలుపు దగ్గరో ఆగిపోవడం ఆంత్రప్రెన్యూర్స్ లక్షణం కాదు. మున్ముందుకు సాగుతూనే ఉండాలి.. మౌనికా పరుగెత్తాలిక!



# ఏక్‌దమ్ ఫిట్




ఆరోగ్యంగా ఉండాలంటే.. ఫిట్‌గా ఉండాలి. ఫిట్‌గా ఉండాలంటే.. బరువును అదుపులో ఉంచాలి. అయితే, అదనపు కొవ్వును వదిలించుకోవడం అంత సులభమైన వ్యవహారం కాదు. ఆ ప్రయత్నంలో ఉన్నవారికి శాస్త్రీయమైన మార్గాన్ని చూపుతున్నారు క్లినికల్ న్యూట్రిషనిస్ట్, మైండ్ అండ్ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్.. దీపిక చలసాని. ఆమె నేతృత్వంలోని 'ఫిట్4లైఫ్ ఇండియా'ఊబకాయంపై యుద్ధం ప్రకటించింది. దీపిక చలసాని.. పుణెలో పుట్టి పెరిగారు. తమిళనాడు నీలగిరి జిల్లాలోని కోటగిరి బోర్డింగ్ స్కూల్‌లో చదివారు. సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఎంబీఏ పట్టా కూడా ఉంది. ఆ తర్వాత కార్పొరేట్ కెరీర్ మొదలైంది. మైక్రోసాఫ్ట్, విప్రో, గూగుల్ తదితర దిగ్గజ సంస్థలకు సేవలందించారు. ఆ సమయంలోనే పెండ్లయింది. ఇద్దరు పిల్లలు. కెరీర్‌లో చాలా పేరు సంపాదించారు. ఖ్యాతి వచ్చినా, డబ్బు పోగైనా.. ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. తరచూ ప్రయాణాలు, తీరిక లేనంత ఒత్తిడి వల్ల రోగాలు చుట్టు ముట్టాయి. నాలుగు పదులు నిండకుండానే బీపీ, షుగర్ దాడి చేశాయి. నిస్సత్తువ ఆవహించింది. బరువు కూడా అధికమైంది. ఒక దశలో 95 కిలోలు దాటింది. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించొచ్చు. ఒంటినిండా రోగాలు ఉన్నప్పుడు, బీరువా నిండా డబ్బున్నా వృథా అని తెలుసుకున్నారు. ఉద్యోగానికి స్వస్తి పలికి.. బరువు తగ్గే మార్గాలు అన్వేషించారు. ఎంతోకొంత తగ్గినా సైడ్ ఎఫెక్ట్స్ వచ్చేవి. ఏం చేయాలో అర్థమయ్యేది కాదు. 'ఇంత చదువు చదివి నా ఆరోగ్యాన్ని నేనే కాపాడుకోలేక పోతున్నానే?' అని బాధపడేవారు.

**సమాధానం కోసం..** దీపిక తండ్రి సుబ్బారావు కూడా ఊబకాయంతో బాధపడేవారు. కానీ పట్టుదలతో పాతిక కిలోలు వదిలించుకున్నారు. 'నేను మాత్రం తగ్గలేనా?' అనుకున్నారు దీపిక. 'బరువు తగ్గాలంటే ఏం చేయాలి?' అనే ప్రశ్నకు జవాబు వెతికారు. ఈ క్రమంలో కొత్త విషయం తెలిసింది. డైట్ కంట్రోల్ కంటే మైండ్ కంట్రోల్ ముఖ్యమని అర్థమైంది. మైండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి వివిధ కోర్సులు చేశారు. 'ఈటింగ్ థెరపీ' ప్రాక్టీస్ చేశారు. పళ్లెంలో పోషకాలకు స్థానం కల్పించారు. ఒక్కసారిగా భారీగా బరువు తగ్గడం కంటే.. మెల్లమెల్లగా తగ్గే పద్ధతినే ఎంచుకున్నారు. రెండు సంవత్సరాల్లో 95 కిలోల నుంచి 68 కిలోలకు వచ్చారు. బరువు తగ్గుతున్నప్పుడు బాడీలో డిటాక్సిఫికేషన్ మొదలవుతుంది. నీరసంగా అనిపిస్తుంది. ఫుడ్ ట్రెండ్ మారడం వల్ల తరచూ మూడ్ మారిపోతుంది. చిన్న చిన్న విషయాలకే కోపం వస్తుంది. ఇష్టమైన రుచులకు దూరంగా ఉండటం కష్టంగానే ఉంటుంది. ఇవన్నీ అదుపు చేయడానికే.. మైండ్ కంట్రోల్ థెరపీని పరిచయం చేస్తారు దీపిక. మనసును గెలిస్తే, పొట్టను గెలవడం ఏమంత కష్టం కాదు. అలా మనసు కేంద్రంగా ఊబకాయంపై పోరాటం మొదలుపెట్టారు.

**సన్నిహితులతో మొదలై..** క్రమంగా 23 కిలోల బరువు తగ్గిన దీపికను చూసి బంధువులు, స్నేహితులు ఆశ్చర్యపోయారు. 'ఎలా సాధ్యమైంది?' అని అడిగారు. దీంతో దీపిక తాను అనుసరించిన వెయిట్ మేనేజ్‌మెంట్ సూత్రాలను వారికీ పరిచయం చేశారు. చాలామందిలో మంచి ఫలితాలు కనిపించాయి. దీంతో బరువు తగ్గాలనుకునే వారికోసం 'ఫిట్4లైఫ్ ఇండియా' పేరుతో ఒక వేదిక ఏర్పాటు చేశారు దీపిక. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ప్రారంభించారు. అంతలోనే కరోనా రావడంతో ఆన్‌లైన్‌కే పరిమితం చేశారు. అక్కడితో ఆగకుండా.. విదేశాలకు వెళ్లి అధునాతన పద్ధతులు అధ్యయనం చేశారు. ఇప్పుడు ఐదు ఖండాల్లో ఫిట్4లైఫ్ ఇండియా సేవలందిస్తున్నది. దేశ మంతటా ఫిట్4లైఫ్‌కు క్లయింట్లు ఉన్నారు. 'బరువు తగ్గడం వల్ల శరీరమే కాదు, మనసూ తేలికపడుతుంది. వృద్ధాప్య లక్షణాలు దూరం అవుతాయి. నా దృష్టిలో ఇదొక సామాజిక వ్యాపారం. ఊబకాయంపై యుద్ధం. అధిక బరువుపై పోరాటం' అంటారు దీపిక.

**తగ్గాలంటే..** ఆహారపు అలవాట్ల విషయంలో క్రమశిక్షణ తప్పితే.. వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉంది. ఒక్కొక్కరి శరీరతత్వం ఒక్కోలా ఉంటుంది. శరీర వ్యవస్థను, జీర్ణశక్తిని బట్టి డైట్ నిర్ణయించుకోవాలి. మేం ఇచ్చే ఫుడ్ వాళ్ల మైండ్‌సెట్‌కి సూట్ అవుతుందా లేదా అన్నదీ పరిశీలిస్తాం. ఫ్యామిలీ ఫుడ్ హిస్టరీని బట్టి ఆహార అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసి.. బరువుకు, వయసుకు తగినట్టు ప్రొటీన్లు అందిస్తాం.

# రంగుల రాజ్యం!

ప్రకృతి నిండా రంగులే. పరికించి చూస్తే అడుగు అడుగుకో వర్ణం. అణువు అణువులో అద్భుతం. మనం అడిగినవీ, అడగనివీ చాలానే ఇచ్చింది. కానీ, మనమే ప్రకృతికి దూరంగా వచ్చేశాం. వికృతికి అలవాటు పడిపోయాం. కృత్రిమత్వానికి దగ్గరయ్యాం. ప్రకృతి నిండా రంగులే. పరికించి చూస్తే అడుగు అడుగుకో వర్ణం. అణువు అణువులో అద్భుతం. మనం అడిగినవీ, అడగనివీ చాలానే ఇచ్చింది. కానీ, మనమే ప్రకృతికి దూరంగా వచ్చేశాం. వికృతికి అలవాటు పడిపోయాం. కృత్రిమత్వానికి దగ్గరయ్యాం. మళ్లీ ప్రకృతి వైపు, సహజత్వం వైపు అడుగులేస్తే ఎంత బాగుంటుందో వివరిస్తున్నారు మాన్య చేరబుద్ధి. నేచురల్ డైయింగ్ కాన్సెప్ట్‌తో సహజ సిద్ధమైన రంగులను పరిచయం చేస్తున్నారామె.ఇష్టమైన షర్ట్ మీద కాఫీ మరక పడితే మనసు విలవిల్లాడుతుంది. ఖరీదైన పట్టుచీరకు మొండి మరక అంటుకుంటే గుండె జారి గల్లంతైపోతుంది. అదేదో సబ్బుల కంపెనీ ప్రకటనలో చెప్పినట్టు మరక మంచిదే అంటున్నది మాన్య. కాకపోతే అది సహజంగా తయారు చేసుకున్నది అయితే చాలంటుంది. సహజ పద్ధతుల్లో దుస్తుల మీద రంగుల అద్దకం గురించి అధ్యయనం చేసిందామె. ఎంతో మందికి ఆన్‌లైన్‌లో నేచురల్ డైయింగ్ గురించి అవగాహన కల్పిస్తున్నది మాన్య చేరబుద్ధి.నేచురల్ డైయింగ్ కొత్తగా వచ్చిందేం కాదు. పురాతన కాలం నుంచీ ఉన్నదే. బట్టలు రంగురంగుల్లో ఆకర్షణీయంగా కనిపించేందుకు పూలు, ఆకులు, సుగంధ ద్రవ్యాల నుంచి తీసిన వర్ణాలను వాడేవారు. సింథటిక్ డైయింగ్ పెరిగిన తర్వాత ఈ ప్రక్రియ క్రమంగా కనుమరుగు అవుతున్నది. చాలామంది పిల్లలకు రంగులు ఎక్కడి నుంచి వస్తాయో కూడా తెలియదు. ఎక్కడో పరిశ్రమల్లో తయారు చేస్తారనే అనుకుంటారు. కానీ, 'ప్రకృతి మనకు తీరొక్క రంగులను బహుమతిగా ఇచ్చింది. రంగులు కూడా ఒక రకమైన ఔషధమే' అంటారు మాన్య. ఈ సహజ వర్ణాలను పసుపు, ఉల్లిపొట్టు, దానిమ్మ తొక్కలు, రకరకాల పూలు, మోదుగు ఆకులు, పోకలు, టీ పొడి, కాఫీ పొడి, మంజిష్ట, పత్తిముగం వంటి వాటితో తయారు చేసుకుని.. వస్త్రాలపై నైపుణ్యంతో అద్దుతుంది మాన్య.సహజ సిద్ధమైన రంగుల తయారీకి ప్రత్యేక పద్ధతులు ఉంటాయి. ముందు మనకు కావాల్సిన రంగు దేని నుంచి వస్తుందో గుర్తించాలి. తర్వాత ఆ పదార్థాన్ని వేడినీళ్లలో 40 నిమిషాల పాటు మరగబెట్టాలి. అప్పుడే, అందులోని రంగు నీటిలోకి దిగుతుంది. డై వేసే ముందు బట్టలను పటిక నీళ్లలో నానబెట్టాలి. తర్వాత నీడలో ఆరేయాలి. అయితే, మనం డై వేయాలనుకున్న ఫ్యాబ్రిక్ కాటన్‌ది అయితేనే రంగు బాగా అంటుకుంటుంది. పసుపు, సుగంధ ద్రవ్యాలు, పూల రంగులు అద్దకం చేసిన వస్త్రాలను నిత్యం ధరించడం వల్ల అందులోని ఔషధ గుణాలు శరీరానికి మేలు చేస్తాయి. చెమట వాసనను అడ్డుకుంటాయి.





**ఆయుర్ వస్త్రం..** ఇప్పటి వరకు మాన్య ఐదువేల మందికి సహజ వర్ణాల తయారీ పద్ధతిని నేర్పింది. అందులో ఓ యాభైమంది నేచురల్ డైయింగ్ బిజినెస్ కూడా స్టార్ట్ చేశారు. నేచురల్ డైయింగ్ పుట్టిందే భారతదేశంలో. మనకు ఆయుర్వేదం మాత్రమే తెలుసు. 'ఆయుర్ వస్త్ర' అనే అంతే ప్రాచీన శాస్త్రం కూడా ఒకటి ఉందన్న సంగతే మరిచిపోయాం. ఈ విషయాలు అందరికీ తెలిసేలా సెమినార్‌లు, వర్క్‌షాప్‌లు, క్లాసులు నిర్వహిస్తున్నది మాన్య. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన మాన్యకు చిన్నప్పటి నుంచీ కళలు, ప్రకృతి అంటే ఇష్టం. ఆ మక్కువతోనే చిన్నప్పటి నుంచీ ఆకులు, పూలను గమనించేది.


# గుండె లయ తప్పితే..?

బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతుండడంతో గుండెపోటుతో పాటుగా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య కూడా పెరుగుతున్నది.

గుండెజబ్బులు అనగానే వెంటనే గుండెపోటు గుర్తుకొస్తుంది. కానీ గుండెపోటు సమస్య మాదిరిగానే గుండెజబ్బు కూడా ఉంటుంది. హృదయ స్పందనలో తేడాల వల్ల ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అనే సమస్య ఇటీవల కాలంలో ఎక్కువైందన్నారు ఎస్టేర్ ప్రైమ్ ఆస్పత్రి ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రఘు. బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతుండడంతో గుండెపోటుతో పాటుగా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య కూడా పెరుగుతున్నది. కాబట్టి దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రఘు సూచించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్టియల్ ఫైబ్రిలేషన్ వ్యాధికి గల కారణాలు, నివారణోపాయాలను వివరించారు.

**ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అంటే?**

గుండె సాధారణంగా నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. ఈ హృదయ స్పందన ఒక క్రమపద్ధతిలో ఉండాలి. రెండు హార్ట్ బీట్ల మధ్య గ్యాప్ ఎక్కువైనా, తక్కువైనా హృదయ స్పందనలో తేడా వస్తుంది. దాంతో గుండె మరింత వేగంగా కూడా కొట్టుకోవచ్చు. ఇలా హృదయ స్పందనల్లో ఏర్పడే అపసవ్యతలనే ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అంటారు. దీనివల్ల శరీరంలోని అవయవాలకు రక్తం సక్రమంగా సరఫరా కాదు. దాంతో రక్తం అంతా గుండె గదుల్లోనే పేరుకుపోతుంది. ఇలా నిల్వ కాబడిన రక్తాన్ని క్రమంగా గడ్డలుగా ఏర్పరుస్తుంది. ఈ రక్తం గడ్డలు గుండెకు మాత్రమే పరిమితం కాకుండా శరీరం అంతటా ప్రయాణిస్తాయి. ఇవి మెదడుకు సులువుగా వెళ్తాయి. అలా మెదడు రక్తనాళాల్లో ఈ గడ్డలు చేరినప్పుడు మెదడుకు రక్తసరఫరాలో అంతరాయం కలిగి బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతం రావడానికి 40 నుంచి 50 శాతం ఏట్రియల్ ఫిబ్రిలేషనే కారణం.



**ఎలా కనుక్కోవడం?**

ఆర్టియల్ ఫైబ్రిలేషన్ వల్ల హృదయ స్పందనల్లో వచ్చే హెచ్చుతగ్గులు స్థిరంగా ఉండవు. ఒక్కసారిగా తేడాలు వచ్చి, మళ్లీ మామూలవ్వొచ్చు. అందువల్ల ఈ సమస్యను ఈసీజీ ద్వారా తెలుసుకోవడం కూడా కొన్నిసార్లు కష్టం అవుతుంది. వైద్య సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తరువాత హృదయ స్పందనల రేటును రికార్డు చేయడానికి అనేక రకాల డివైస్‌లు వచ్చాయి. యాపిల్ వాచ్‌లు, ప్రత్యేకమైన సాంకేతికత ద్వారా రూపొందించిన దుస్తుల ద్వారా కూడా వీటిని రికార్డు చేయవచ్చు. ఇంప్లాంటబుల్ లూప్ రికార్డర్ ద్వారా ఒక మైక్రోచిప్‌ని చర్మంలో అమర్చి, ఆర్టియల్ ఫైబ్రిలేషన్‌ను కనుక్కోవచ్చు. అయితే బీపీ, షుగర్ లాంటి వ్యాధులున్నవాళ్లు, అప్పటికే గుండెపోటు రావడం, గుండె పంపింగ్ సామర్థ్యం తక్కువగా ఉన్నవాళ్లు, ర్యుమాటిక్ హార్ట్ డిసీజ్ ఉన్నవాళ్లు, ఒకసారి స్ట్రోక్ వచ్చిన వాళ్లు ఈ పరీక్షల ద్వారా ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య ఉందో లేదో చెక్ చేయించుకోవాలి. ఈ సమస్య ఉన్నవాళ్లలో గుండెదడ, ఆయాసం ఉంటాయి. ఎప్పుడూ నీరసంగా ఉంటుంటారు. కానీ పెద్దవాళ్లయితే వయసు వల్ల వచ్చిన నీరసం అని సరిపెట్టుకుంటుంటారు. కానీ అశ్రద్ధ చేయకూడదు. షుగర్ ఉండి, ఇలాంటి లక్షణాలుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

**ఎందుకిలా?**

సాధారణంగా వయసు పెరిగినాకొద్దీ శరీరంలోని అవయవాల్లో తేడాలు వస్తాయి. వాటి పనితీరు మందగిస్తుంది. అలా గుండె కొట్టుకోవడంలో కూడా సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీనికి తోడు ఆధునిక జీవనశైలి వల్ల ముంచుకొచ్చిన అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధులు ఉన్నవాళ్లలో కూడా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య వచ్చే అవకాశం ఎక్కువ. అంతేకాదు, ర్యుమాటిక్ హార్ట్ డిసీజ్ వల్ల కూడా గుండె కొట్టుకోవడంలో తేడాలు వస్తాయి.

**పరిష్కారం ఎలా.?**


మందుల ద్వారా గుండె గదుల్లో రక్తం గడ్డ కట్టకుండా చేయవచ్చు. నోటి ద్వారా తీసుకునే యాంటి కోయాగ్యులెంట్ మందులు 65 నుంచి 70 శాతం స్ట్రోక్ రిస్క్ రాకుండా నివారిస్తాయి. అయితే వీటి వల్ల రక్తస్రావం అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఇప్పుడు కొత్త మందులు వచ్చాయి. నావల్ యాంటి కోయాగ్యులెంట్స్ అనే ఈ మందులు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయి. రక్తస్రావం అయ్యే అవకాశం చాలా తక్కువ. ఈ సమస్య ఉన్నప్పటికీ మంచి చికిత్సలున్నాయి. కాబట్టి అవగాహన పెంచుకుని, సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలని డాక్టర్ రఘు సూచించారు.

# బరువు దించే.. బేరియాట్రిక్ కాలం మారుతున్నది...

విధానాలు, ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. దాదాపు అన్ని పనులూ టెక్నాలజీ సాయంతోనే జరిగిపోతున్నాయి. దీంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. ఈ ధోరణి ఊబకాయానికి దారితీస్తున్నది. బరువు పెరిగేకొద్దీ జీవితం బరువుగా మారిపోతుంది. అయినా, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర అనారోగ్య సమస్యలు రావచ్చు. ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదమూ ఉంది. బేరియాట్రిక్ సర్జరీలాంటి విధానాలతో ఊబకాయ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

**ఎవరికి చేయవచ్చు?**

బేరియాట్రిక్ సర్జరీ.. బరువును నియంత్రించే శస్త్రచికిత్స. ఇది 'బ్యరోస్' (బరువు) అనే పదం నుంచి వచ్చింది. అయితే, ఈ సర్జరీకి కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. 40 బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్)కంటే ఎక్కువ బరువు ఉన్నా.. లేదా 35 బీఎంఐ కంటే ఎక్కువ ఉండి.. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊపిరితిత్తులపై ఒత్తిడి (అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా) తదితర సమస్యలతో బాధపడుతున్నా.. బేరియాట్రిక్ సర్జరీ చేయాలని ఓ నియమం. గత ఏడాది ఈ మార్గదర్శకాలకు కొన్ని మార్పులు చేశారు. ఆ ప్రకారం.. బీఎంఐ 35 కంటే ఎక్కువగా ఉన్నా.. బీఎంఐ 30 కంటే ఎక్కువ ఉండి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా.. బేరియాట్రిక్ సర్జరీ చేయవచ్చు. భారతీయుల విషయానికొస్తే.. బీఎంఐ 27 కంటే ఎక్కువ ఉంటూ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు నిరభ్యంతరంగా ఈ సర్జరీకి వెళ్లవచ్చు.



**బీఎంఐ ప్రకారం..** ఒక వ్యక్తి బరువు (కిలోలలో)ను ఎత్తు (మీటర్ స్కేర్‌లలో)తో భాగిస్తే వచ్చే ఫలాన్నే సదరు వ్యక్తి బీఎంఐగా పరిగణిస్తారు. సాధారణ వ్యక్తుల బీఎంఐ 18-27 మధ్య ఉండాలి. అదే,18 కంటే తక్కువ ఉంటే పోషకాల లోపంతో బాధపడుతున్నట్టు. బీఎంఐ 27.5 కంటే ఎక్కువైతే ఊబకాయంగా పరిగణించవచ్చు.బీఎంఐ 35 కంటే ఎక్కువైతే.. మార్బిడ్ ఒబేసిటీ. ప్రాణాంతక ఊబకాయంగా భావించాలి. బీఎంఐ 50 కంటే ఎక్కువైతే.. 'సూపర్ ఒబేసిటీ'గా పరిగణిస్తారు. ఇది చాలా ప్రమాదకర స్థాయి. శరీరం రోగాల పుట్టగా మారిపోవచ్చు.

**జాగ్రత్తలు :** బీఎంఐ 25 స్థాయిలో ఉన్నప్పుడే అప్రమత్తమైతే మంచిది. ఆరోగ్యకరమైన ఆహార విధానాన్ని కొనసాగించాలి. చెడు కొవ్వులకు, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి.రోజూ అరగంట అయినా వ్యాయామం చేయాలి. ఒత్తిడి పెంచుకోకూడదు. మూడుపదుల తర్వాత తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. బరువు పెరగడం వల్ల.. షుగర్ స్థాయి పెరుగుతుంది. ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా శ్వాస సమస్య ఏర్పడుతుంది. సీ-పాప్ యంత్రాలు వాడాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుంది.

**కీళ్లనొప్పులు వస్తాయి...**

మహిళల్లో సంతానలేమి (ఇన్‌ఫెర్టిలిటీ) సమస్య వస్తుంది. ఫ్యాటీలివర్ ఏర్పడి.. సిరోసిస్‌కు దారితీసే ప్రమాదం ఉంది.

**నిర్ధారణ పద్ధతులు :** ఒక వ్యక్తి అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్న విషయాన్ని శాస్త్రీయంగా గుర్తించేందుకు రెండు పద్ధతులు ఉన్నాయి. మొదటిది.. అందరికీ తెలిసిన బీఎంఐ. రెండోది.. వెయిస్ట్ హిప్ రేషియో (నడుము/తుంటి నిష్పత్తి). ఈ నిష్పత్తి మహిళల్లో 0.8 కంటే తక్కువ ఉండాలి. పురుషుల్లో 1 కంటే తక్కువ ఉండాలి. అనంతరం రక్తపరీక్షలు, ఊపిరితిత్తులు, గుండె పరీక్షల ద్వారా ఏ అవయవంపై ఎంత ఒత్తిడి పడుతుందో తెలుసుకోవచ్చు.

**చికిత్సా విధానాలు :** అధిక బరువుకు రెండురకాల ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి సర్జికల్ పద్ధతి. దీన్నే బేరియాట్రిక్ సర్జరీ అంటారు. రెండోది.. ఎండోస్కోపిక్ పద్ధతి. బేరియాట్రిక్ పద్ధతిలో న్యూరో హార్మోనల్ సైకిల్‌ను నియంత్రించడంతో పాటు శరీరంలోని ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను తగ్గించి, ఇన్సులిన్ ఊటను బాగా పెంచుతారు. ఫలితంగా జీవక్రియ వేగవంతమై, కొవ్వు కరిగిపోతుంది. బేరియాట్రిక్ సర్జరీకి పెద్దగా సమయం పట్టదు. మొత్తం శస్త్రచికిత్స గంటన్నర నుంచి రెండు గంటల్లో పూర్తవుతుంది. రోగిని నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ చేయవచ్చు. శస్త్ర చికిత్స జరిగిన 10 రోజుల తరువాత రోగులు సాధారణ జీవనాన్ని గడపవచ్చు.

**ఎండోస్కోపిక్ పద్ధతి :** ఇది కూడా సురక్షితమైన విధానమే. కాకపోతే, 27-30 బీఎంఐ ఉన్నవారికే ఎండోస్కోపీ ద్వారా చికిత్స చేస్తారు. ఇందులో మళ్లీ రెండురకాలు. ఇంట్రాగ్యాస్ట్రిక్ బెలూన్ ఈ పద్ధతిలో రోగి పొట్టలోకి సైన్ నింపిన సిలికాన్ బెలూన్ పంపుతారు. దాదాపు ఆరు నెలల తర్వాత.. దాన్ని ఎండోస్కోపీ పద్ధతిలో తొలగిస్తారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆ తర్వాత మరో బెలూన్ పంపాలా లేదా అనేది నిర్ణయిస్తారు.

**బేరియాట్రిక్ సర్జరీతో ఉపయోగాలు**

70-80 శాతం అదనపు బరువు తగ్గిపోతుంది.
80-90 శాతం టైప్-2 డయాబెటిస్ నియంత్రణలోకి వస్తుంది.
70-80శాతం అధిక రక్తపోటు అదుపులోకి వచ్చేస్తుంది.
ఊపిరితిత్తులపై ఒత్తిడి తగ్గిపోతుంది. ఇక, సీ-పాప్ అవసరం ఉండదు.
మహిళల్లో సంతానలేమి సమస్య తీరిపోతుంది.అవయవ మార్పిడి అవసరమైన రోగులకు తగిన అవయవాలు లభిస్తాయి. ఎందుకంటే, అధిక బరువు సమస్య ఉన్న వారికి.. వారి పరిమాణానికి సరిపడా అవయవాలు లభించడం కష్టం.

**ఎండోస్లీవ్ :** ఎండోస్కోపిక్ స్లీవ్ గ్యాస్ట్రోప్లాస్టీ.. పద్ధతిలో రోగి పొట్ట సైజును తగ్గిస్తారు. దీంతో, ఇట్టే పొట్ట నిండిపోతుంది. తక్కువ ఆహారం తీసుకుంటారు. ఈ రెండు పద్ధతుల్లోనూ ఇన్‌పేషెంట్‌గా ఉండాల్సిన అవసరం రాదు. దాదాపుగా అదే రోజు డిశ్చార్జ్ చేస్తారు. తొలుత కొంత అసౌకర్యంగా అనిపించినా.. వెంటనే సర్దు కుంటుంది. ఈ విధానాల్లో తీవ్ర దుష్ఫలితాలు ఉండవు. అన్నిటికీ మించి ఊబకాయం వల్ల వచ్చే ప్రాణాపాయం తప్పుతుంది.

# తమలపాకుతో చాలా లాభాలు

**తమలపాకు ఆరోగ్యానికి మంచిది. ఇందులో కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ సాయపడుతుంది. తమలపాకు తింటే మరెన్నో ఉపయోగాలు..**



ప్రతి రోజు 7 తమలపాకులను ఉప్పుతో కలిపి ముద్దగా నూరి వేడినీళ్లతో తీసుకుంటే బోద వ్యాధితో బాధపడుతున్న వారికి చక్కని ఫలితం కనిపిస్తుంది. తమలపాకు రసాన్ని రెండు కళ్లలోనూ చుక్కలుగా వేస్తే రేచీకటి సమస్య క్రమంగా తగ్గుతుంది. తమలపాకు రసాన్ని టీ స్పూన్ మోతాదులో తీసుకుంటే గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఎక్కువగా కూర్చొని పనిచేసేవారికి సాధారణంగా ఎదురయ్యే సమస్య వెన్నునొప్పి. వేడిగా ఉండే తమలపాకు రసాన్ని కొబ్బరినూనెతో కలిపి బాగా మిక్స్ చేసి, వెన్నుకు మర్దన చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలుగుతుంది. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడేవారు ఆవనూనెను గోరువెచ్చగా చేయాలి. దీనిలో తమలపాకును నానబెట్టి ఈ మిశ్రమాన్ని ఛాతి మీద రాస్తే ఉపశమనం దొరుకుతుంది.రోజూ ఒక తమలపాకును తింటే మలబద్ధకం సమస్య తగ్గిపోతుంది. దెబ్బలు తగిలినప్పుడు వాపు, రక్తం గడ్డ కట్టడం లాంటివి జరిగినప్పుడు తమలపాకును వేడి చేసి వాపు లేదా రక్తం గడ్డ కట్టిన ప్రాంతంలో కట్టులాగా కడితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.భోజనం తర్వాత తమలపాకు తింటే నోరు శుభ్రమవుతుంది. ఇది జీర్ణక్రియకు బాగా తోడ్పడుతుంది. కానీ ఈ ఆకును అధికంగా తీసుకుంటే అనర్థాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాన్, ఇతర ఏ రూపంలో అయినా రోజుకు ఒక ఆకును మించి తీసుకోవద్దని చెబుతున్నారు.చుండ్రు సమస్యతో బాధపడుతున్నవారు తమలపాకులను ముద్దగా చేసి తలకు పట్టించాలి. గంటసేపు ఆగి తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది. ఇలా చుండ్రు సమస్య తగ్గేవరకు వారానికి రెండుసార్లు చొప్పున చేయవచ్చు.

# చలికాలంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడండిలా..!


చలికాలం వచ్చిందంటే చాలు.. పెద్దలకే కాదు.. పిల్లలకూ శ్వాస కోశ సమస్యలు ఎదురవుతుంటాయి. దగ్గు, జలుబు, జ్వరం తదితర అనారోగ్య సమస్యలు పెద్దల కన్నా పిల్లల్నే ఎక్కువగా ఇబ్బందులకు గురిచేస్తాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడం చాలా అవసరం. కింద సూచించిన పలు సలహాలను పాటిస్తే చలికాలంలో పిల్లల్ని ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యల బారి నుంచి కాపాడవచ్చు. మరి ఆ సలహాలు, సూచనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..! చలికాలంలో పిల్లలు పొద్దున్నే నిద్ర లేవడానికి బద్ధకిస్తుంటారు. ఈ సమస్య లేకుండా చేయాలంటే.. పిల్లల్ని రాత్రిపూట త్వరగా పడుకోబెట్టాలి. అలాగే తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలను రాత్రి పూట ఇవ్వాలి. దీంతోపాటు పాలను కూడా తాగించాలి. దీంతో చక్కగా నిద్ర పడుతుంది. ఉదయాన్నే ఉత్సాహంగా నిద్ర లేస్తారు. చలికాలంలో రాత్రి లేదా పగలు ఎప్పుడైనా సరే పిల్లలు బయటకు వెళ్తుంటే ఉన్ని దుస్తులు వేయాలి. ఈ కాలంలో ఐస్‌క్రీములు, కూల్ డ్రింక్‌లు వంటివి కొనివ్వడం మానేయాలి. పిల్లల తలను కప్పి ఉంచేలా స్వెటర్, మంకీ క్యాప్‌లను ధరింపజేయాలి. చలికి పాదాలు పగలకుండా ఉండేందుకు సాక్సులు, షూ ధరింపజేయాలి. చేతులకు గ్లోవ్స్ వేయాలి.







# అన్ని ఫ్లూ జ్వరాలకీ ఒకే వ్యాక్సిన్!



జలుబు, దగ్గులతో అతలాకుతలం చేసేది ఫ్లూ. ఇప్పటికే కొన్ని రకాల ఫ్లూ వైరస్‌లకి వ్యాక్సిన్లు ఉన్నాయి. కాని కొన్ని రకాల వైరస్‌ల వల్ల కలిగే ఫ్లూని ఏమీ చేయలేకపోతున్నాం. అయితే ఇప్పుడు అన్ని రకాల ఫ్లూ వైరస్‌లనూ నియంత్రించడానికి ఒకే వ్యాక్సిన్‌ను రూపొందించడానికి కసరత్తు జరుగుతోంది. జలుబుకు మందులు వాడితే వారంరోజుల్లో వాడకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుందని ఓ మాట ఉండనే ఉంది.

అంటే జలుబును నియంత్రించే సరైన చికిత్స లేదని అర్థం. జలుబు కొన్ని వేల రకాల వైరస్‌లలో ఏదో ఒకదానివల్ల కలుగుతుంది. ఇవన్నీ ఫ్లూ వైరస్‌లే. అందుకే ఇన్ని రకాల వైరస్‌లకు వ్యాక్సిన్లు తయారుచేయడం కష్టమైంది. కాని ఇప్పుడు అన్నిటికీ కలిపి ఒకే వ్యాక్సిన్‌ను తీసుకొచ్చే పనిలో ఉన్నారు పరిశోధకులు. ఫ్లూ వైరస్‌ల ఉపరితలం మీద హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ ఉంటుంది. హోస్ట్ కణాలపై దాడి చేయడానికి ఇదే మార్గదర్శనం చేస్తుంది.

ఈ ప్రొటీన్ వల్లనే వైరస్ మనల్ని ఇన్‌ఫెక్ట్ చేస్తుంది. ఈ హీమాగ్లుటినిన్‌లో తల (హెడ్), తోక (స్టాక్) అనే రెండు భాగాలుంటాయి. వీటిలో తల భాగం అన్ని వైరస్‌లలో ఒకేలా ఉండదు. కాని స్టాక్ మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. అందువల్ల హీమాగ్లుటినిన్ స్టాక్‌ను టార్గెట్ చేస్తూ వ్యాక్సిన్‌ను తయారుచేయవచ్చని భావిస్తున్నారు సైంటిస్టులు. ఇందుకోసం కైమెరిక్ హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ రకంపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ పరిశోధనలు విజయవంతం అయితే యూనివర్సల్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ రాక ఎంతో దూరంలో ఉండదంటున్నారు ప్రొఫెసర్ ఫ్లోరియన్ క్రామర్.